PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 128 | విజయవాడ, ఆదివారం 10 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 10 December 2023 | Rs

మహారాష్ట్ర, కర్ణాటకలో

ఎన్ఐఎ విస్తృత సోదాలు

- 44 చోట్ల ప్రత్యేక ఆపరేషన్
- 15 మంది అరెస్ట్

5

రాష్ట్రవ్యాప్త జాతీయ లోక్ అదాలత్ సక్సెస్

- ఒక్కరోజులో 21,574 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని స్టేట్ లీగల్ సెల్ అథారిటీ తెలిపింది. 16,807 పెండింగ్ కేసులతోపాటు 4,767 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 386 లోక్ అదాలత్ బెంచ్‌లు ఆయా కేసులను విచారించి, పరిష్కరించాయని వివరించింది. ఆయా కేసులకు సంబంధించి రూ.74.05 కోట్లు సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిపింది. న్యాయమూర్తులు టి.రాజశేఖరరావు, వి.గోపాలకృష్ణారావు ఆధ్వర్యాన హైకోర్టులో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. మొత్తంగా హైకోర్టులో 137 కేసులు పరిష్కారమయ్యాయని, రూ.2.85 కోట్లు సెటిల్‌మెంట్ చేశారని తెలిపింది.

అభివాదం చేస్తున్న నాయకులు

విద్యారంగ పరిరక్షణకు

సామాజిక ఉద్యమం

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

'ఓట్ ఫర్ ఒపిఎస్' నినాదంతో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని తిరోగమనం వైపు తీసుకెళుతోందని ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు విమర్శించారు. ప్రాథమిక విద్యను బతికించేందుకు ఉపాధ్యాయులు కదలి తల్లిదండ్రులతో కలిసి సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర 49వ కౌన్సిల్ సమావేశాలు శనివారం స్థానిక మినీ బైపాస్ రోడ్‌లోని చలసాని గార్డెన్స్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక కెనాల్ రోడ్‌లోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సభా ప్రాంగణంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జెండాను సాబ్జీ, యుటిఎఫ్ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, జాతీయ జెండాను పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జయప్రభ ఆవిష్కరించారు. యుటిఎఫ్ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఆ తర్వాత జరిగిన ప్రారంభ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు. ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నియామకాలకు ఒక డిఎస్‌సి కూడా వైసిపి ప్రభుత్వం విడుదల చేయలేదని గుర్తు చేశారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తానన్న సిఎం జగన్ మాట తప్పారని, జిపిఎస్ ప్రకటించడం సరికాదని అన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని భర్తీ చేయకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమో చెప్పాలని ప్రశ్నించారు. పాఠశాలల విలీన ప్రక్రియ ద్వారా విద్యారంగం తీవ్రంగా నష్టపోతోందని, విద్య చుట్టూ సామాజిక ఉద్యమాలు నిర్మించడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవడానికి యుటిఎఫ్ బహుముఖ కార్యక్రమాలు చేస్తోందన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని రాజకీయ అజెండాగా మార్చేందుకు 'ఓట్ ఫర్ ఒపిఎస్' నినాదంతో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఎంఎల్‌సి, యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదంటూ నిర్బంధాలకు పూనుకుంటున్నారని, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. షేక్ సాబ్జీ మిగతా 2లో

మానవ తప్పిదం వల్లే కంటకాపల్లి ప్రమాదం

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి- గోపాలపట్నం, వేపాడ

మానవ తప్పిదం వల్లే విజయనగరం జిల్లా కంటకాపల్లిలో ఇటీవల రైలు ప్రమాదం సంభవించిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతోందని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా రూ.20 కోట్లతో విశాఖ జిల్లా సింహాచలం రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తిలో నిక్షయ్ మిత్ర కింద టి.బి.రోగులకు పౌష్టికాహారాన్ని, పిఎం ఉజ్వల యోజన కింద పలువురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ త్వరలో మరిన్ని వందే భారత్ రైళ్లు పట్టాలెక్కనున్నాయన్నారు. వారానికి ఒక వందే భారత్ రైలు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఎపిలో రైల్వేల అభివృద్ధికి రూ.8,406 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. భూ కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. దేశంలో 5జి మొబైల్ సర్వీసుల విస్తరణ చాలా వేగంగా జరుగుతోందన్నారు.

దీపావళికి బిఎస్ఎన్ఎల్ 5జి

దీపావళికి బిఎస్ఎన్ఎల్ 5జి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నాలుగు వేల సెల్ ఫోన్ టవర్లు ఏర్పాటవుతున్నాయన్నారు. అందులో ఎక్కువ ఉత్తరాంధ్రలోనే నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు. కొత్తవలస రైల్వేస్టేషను ప్రపంచస్థాయి రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కెకె.లైన్‌ను డబుల్ లైన్‌గా మార్పు చేస్తున్నట్టు తెలిపారు.

కంటితుడుపు హామీలు

విపత్తు రైతుకు భరోసా ఇవ్వని ప్రభుత్వం

- ఎన్యూమరేషన్, ధాన్యం కొనుగోలు, పరిహారం.. అన్నింటా అస్పష్టతే
- ఒకే సీజన్‌లో కరువు,తుపాన్
- కేంద్ర సహాయంపై మీనమేషాలు
- ఇప్పుడు దుర్భిక్షంపై రాష్ట్రానికి బృందాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తు రైతును ఆదుకునే విషయంలో ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంబిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ఒకే సీజన్‌లో కరువు, తుపాన్ నష్టాలతో కుదేలైన రైతాంగానికి అన్ని విధాలా సహకారం ఇవ్వాల్సిన ప్రభుత్వమే కంటితుడుపు హామీలకు పరిమితమవుతోంది. సహాయంపై రైతుల్లో భరోసా కల్పించాల్సింది పోయి అస్పష్టతకు, గందరగోళానికి కారణమవుతోంది. నష్టం అంచనాల దగ్గర నుంచి నిబంధనల వరకు ప్రతిదీ అన్నదాతలను మనోవ్యథకు గురి చేస్తున్నాయి. సర్కారు నుంచి తమకు తక్షణం సహాయ సహకారాలు అందుతాయని ఆశతో ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటలపై కరువు, ఆపై మిచౌంగ్ తుపాను విరుచుకుపడ్డాయి. కరువు వలన 30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదు. వర్షాభావం, సాగునీటి కొరత, విద్యుత్ కోతల కారణంగా సాగైన లక్షలాది ఎకరాల్లో పైర్లకు భారీ నష్టం వాటిల్లింది. కరువును గుర్తించే విషయంలో ప్రభుత్వం వాస్తవ విరుద్ధంగా వ్యవహరించింది. కేవలం ఏడు జిల్లాల్లోని 103 మండలాలనే ప్రకటించింది. కరువు మండలాల ప్రకటనపై కేంద్ర కరువు మాన్యువల్‌లో పేర్కొన్న డెడ్‌లైన్ ఆఖరి క్షణాల్లో గెజిట్ జారీ చేసింది. కరువు సమస్య ఉన్న మరిన్ని మండలాలను ప్రకటించాలన్న రైతుల డిమాండ్‌ను సర్కారు పట్టించుకోలేదు. ప్రకటించిన మండలాల్లోనైనా పంట నష్టంపై ఎన్యూమరేషన్ పారదర్శకంగా జరగలేదు. ఎన్ని లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయో అంతా గోప్యం. సుమారు 14 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని, ఉద్యానవన పంటలు కూడా నష్టపోయాయని చెబుతున్నారు.

తుపాను బీభత్సం

ఈ నెల 2 నుంచి 6 వరకు మిచౌంగ్ తుపాను పలు జిల్లాలపై ప్రతాపం చూపించింది. తిరుపతితో పాటు కోస్తాలో దాదాపు అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. వరి, పత్తి, శనగ, మిర్చి, సహా అనేక పంటలకు, తోటలకు భారీ నష్టాలు కలిగించాయి. అక్కడక్కడ రబీ పంటలు కూడా పోయాయి. ఈదురుగాలులకు పైర్లు పొలాల్లో పడిపోయాయి. ఇప్పటికీ కొన్ని చోట్ల నీటిలో వరి, ఇతర పంటలు నానుతున్నాయి. వర్షాలు తగ్గి రెండు రోజులవుతున్నా ఇంకా వరద ప్రాంతాల్లో నష్టాల అంచనాలు వేయలేదు. సోమవారం నాటికి సమాచారం పంపాలని క్షేత్ర స్థాయి యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి వద్ద సమీక్షలో తుపాన్ వలన నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా తేల్చారు. సమగ్ర పరిశీలనలలో ఏరియా ఇంకా పెరుగుతుంది. ఉద్యానవన పంటలు కలపాలి. చేలల్లో పొట్టమీద ఉన్న వరి బాగా దెబ్బతింది. కోసి కల్లాలపై ఉన్న ధాన్యం, ఆరబోసిన ధాన్యం తడిచింది. మొలకలొస్తున్నాయి. రంగుమారే అవకాశం ఉంది. రంగుమారిన, తడిచిన ధాన్యాన్ని కొంటామని సర్కారు చెపుతున్న మాటలు కంటితుడుపుకేనని తెలుస్తోంది. అటువంటి ధాన్యం ఎంత ఉంది అనే దానిపై సరైన అంచనాల్లేవు. ధాన్యంలో తేమ శాతం 17 శాతమే ఉండాలి. పాయింట్‌కు ఇంతని డబ్బులు కత్తిరించి 22 శాతం వరకు అనుమతిస్తారు. ప్రస్తుతం తేమ శాతం 28 శాతం పైనే ఉంటోంది. ఆ ధాన్యాన్ని కొనాలంటే నాణ్యతా ప్రమాణాల నిబంధనలు సడలించాలి. అది కేంద్రం అనుమతితో జరగాలి. ధాన్యాన్ని కొంటామంటున్న ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడే విషయంపై నోరుమెదపట్లేదు. రంగుమారిన, మొలకలొచ్చిన ధాన్యంపైనా ఇదే పరిస్థితి. పత్తి కొనుగోలుకు సిసిఐ నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలు సడలించాలన్నా కేంద్రం అనుమతి కావాలి. దీనిపై సర్కారు చర్యలు చేపట్టట్లేదు. తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలన్న డిమాండ్ వస్తోంది. దానిపైనా అంతే. రైతులకు పరిహారం నిర్ణయిస్తూ గత నెల 14న జారీ చేసిన జిఒ మార్పుపైనా ప్రభుత్వంలో మిగతా 2లో

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

- 'గుండ్లకమ్మ' నిర్వహణ గాలికి
- చాలా కాలంగా మరమ్మతులకు నోచుకోని రిజర్వాయర్ గేట్లు
- ముందుగానే మేల్కొని ఉంటే 80 వేలు ఎకరాలకు నీళ్లు అందేవి

గుండ్లకమ్మ ప్రాజెక్టులో నీళ్లు ఆపే రెండో గేటు కొట్టుకుపోగా పైకి లేపే భాగం మిగిలిన దృశ్యం

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

నిర్వహణలోపం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ డ్యామ్ గేట్ల పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కు చందంగా తయారైంది. గత ఏడాది ఆగస్టులో మూడవ నెంబరు గేటు కొట్టుకుపోగా, ఇప్పుడు మరో గేటు కొట్టుకుపోయింది. దీంతో మిగతా గేట్ల పరిస్థితి ఏమిటన్న అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. ఒక్క గుండ్లకమ్మ డ్యామ్ అనే కాదు, రాష్ట్రంలో చాలా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ ఇదే విధంగా అఘోరిస్తున్నట్లు పేరు తెలపడానికి ఇష్టపడని ఓ సీనియర్ ఇరిగేషన్ అధికారి చెప్పారు. నిర్వహణ సరిగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమనేది నిర్వివాదాంశం ఇందుకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించడం లేదు. దీంతో గేట్లను శుభ్రం చేసేందుకు సంబంధిత ఇంజినీర్లే ఒక్కొక్కసారి తమ జేబులో డబ్బులు పెట్టాల్సి వస్తోందని ఆ అధికారి తెలిపారు. నిర్వహణ చూసుకునే సిబ్బంది పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్వహణకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. గతంలో చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో మిగతా 2లో

పత్తాలేని పాలకపక్ష నేతలు...

- డ్యామ్‌ను సందర్శించిన రైతు, కౌలు సంఘాల నాయకులు

యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేయించాలి

- ఎపి రైతు సంఘం

2

తుపాను, కరువు నష్టాలపై

నిర్లక్ష్య వైఖరి వీడండి

- అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

మైనారిటీ విద్యార్థుల పట్ల వివక్ష

- మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ ఎత్తివేసేందుకు కేంద్రం కుయుక్తులు
- ఎంఎఎన్ఎఫ్‌ని పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

బిఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా కెసిఆర్

● లోపలి పేజీలో..●

ఆర్‌టిసి బస్సుల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి) పథకం ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

వంద రోజుల్లో అమలు

- ఆరు గ్యారంటీలపై తెలంగాణ సిఎం రేవంత్
- 'మహాలక్ష్మి' పథకానికి శ్రీకారం
- 'ఆరోగ్యశ్రీ' పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్లు

2

సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

రైతురాజ్యం తీసుకొస్తాం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వైసిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి.. రైతుల సమస్యలు తీరుస్తామని, రైతు రాజ్యం రావడానికి టిడిపి, జనసేన కలిసి పనిచేస్తాయని, అరాచక శక్తులు రాజ్యమేలుతున్నప్పుడు రాష్ట్ర ప్రజలు ఒకటి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. బాపట్ల జిల్లాలో బాపట్ల, పర్చూరులో తుపానుకు దెబ్బతిన్న పంటలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పర్చూరు మండలం చెరుకూరులో నిర్వహించిన సభలో రైతులు, ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. వాగులు, కాలువల్లో పూడికలు తీసేయించినట్లయితే రైతులు ఇంతగా నష్టపోయే వారు కాదన్నారు. ప్రస్తుత రైతుల దుస్థితికి సిఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. గాల్లో తిరిగి రైతుల సమస్యను ముఖ్యమంత్రి గాలికి వదిలేసి వెళ్లిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో రహదారులు బాగాలేవు కాబట్టే ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టుల గేట్లకు మరమ్మతులు చేయలేని ముఖ్య మంత్రి రాజధాని కడతారా.? అని ప్రశ్నించారు. ఈనాడు, ఈటివి, ఆంధ్రజ్యోతి, ఎబిఎన్‌లు చూడొద్దని, ఒక్క సాక్షి మాత్రమే చూడండి అని ప్రజలకు సిఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన చెరుకూరుకు చెందిన మిర్చి రైతు గడ్డం శ్రీనివాసరావుకు రూ. రెండు లక్షల ఆర్థికసాయం ప్రకటించారు.

కాల్పుల విరమణకు మోకాలడ్డిన అమెరికా

ఐరాసలో తీర్మానాన్ని వీటోతో అడ్డుకున్న అగ్రరాజ్యం

న్యూయార్క్: గాజాలో ఇజ్రాయిల్ దాడులను ఆపడం కోసం ఐరాస భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం భద్రతా మండలిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ శుక్రవారం తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మండలిలోని మొత్తం 15 సభ్య దేశాలకు గాను 13 దేశాలు దీనికి అనుకూలంగా ఓటు వేశాయి. బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది. భద్రతామండలిలో అయిదు శాశ్వత సభ్యదేశాల్లో ఒకటైన అమెరికా తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాన్ని అడ్డుకుంది. కాల్పుల విరమణతో హమాస్ మళ్లీ పుంజుకుంటుందని ఏమాత్రం పసలేని వాదనను అమెరికా ముందుకు తెచ్చింది. అమెరికా ప్రతినిధి రాబర్ట్ వుడ్ మాట్లాడుతూ.. 'ఈ తీర్మానం వాస్తవికతకు దూరంగా ఉంది. ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలు శాంతి, భద్రతల మధ్య జీవించాలన్నదే మా అభిమతం. కాల్పుల విరమణకు అంగీకరిస్తే.. హమాస్ మరో యుద్ధానికి ప్రణాళిక రచిస్తుంది. శాంతిపై, రెండు దేశాల సిద్ధాంతంపై హమాస్‌కు విశ్వాసం లేదు' అని అన్నారు. ప్రస్తుత తీర్మానంలో కొన్ని సవరణలు చేయాలని సూచించారు. తాము ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేయడంపై యుఎఇ తీవ్ర నిరాశ వ్యక్తం చేసింది.

ఐరాస తీర్మానాన్ని వీటో చేస్తున్న అమెరికా ప్రతినిధి రాబర్ట్ వుడ్

గాజాలో ప్రస్తుత దారుణ పరిస్థితులను చూసి చలించిన ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అసాధారణ అధికారాన్ని ఉపయోగించి కాల్పులవిరమణ కోసం భద్రతామండలి తక్షణమే సమావేశం కావాలని కోరారు. ఇందుకోసం ఐరాస ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ని ఆయన ప్రయోగించారు.

ఈ తీర్మానంపై గుటెరస్ మాట్లాడుతూ హమాస్ తప్పిదాలకు పాలస్తీనా ప్రజలను సామూహికంగా శిక్షించడం సరికాదని అన్నారు. తక్షణం కాల్పుల విరమణ జరిగేలా చూడాలని అన్నారు. 'గాజా ప్రజల కష్టాలను అంతం చేయాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజం మీద ఉంది. ప్రజల ప్రాణాలను కాపాడడానికి, వారికి మానవతా సాయం అందేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నింటిని చేయాలి. ఇజ్రాయిల్ దాడుల్లో ఐరాసకు చెందిన 130 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఒకే యుద్ధంలో ఐరాసకు చెందిన ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి" అని పేర్కొన్నారు.

మిచౌంగ్ బాధిత కుటుంబాలకు

రూ.6000 చొప్పున పరిహారం

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నయ్ : తమిళనాడులో మిచౌంగ్ తుపాను బాధితులకు కుటుంబానికి రూ.6000 చొప్పున పరిహారం అందజేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శనివారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ.4 లక్షలు చొప్పున అందజేస్తున్న పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచారు. మిగిలిన పరిహారాన్ని కూడా గతం కంటే పెంపుదల చేశారు. స్వల్ప మరమ్మత్తుల కోసం ఇంటికి రూ.8 వేలు, వరి పంట హెక్టారుకు రూ.17 వేలు, కొబ్బరి వంటి దీర్ఘకాల పంటలకు హెక్టారుకు రూ.22500, ఆరుతడి పంటలకు హెక్టారుకు రూ.8500, ఆవులు, గేదేలకు ఒక్కొ పశువుకు రూ.37500, మేకలు, గుర్రెలు ఒక్కొ జీవానికి రూ.4 వేలు చొప్పున పరిహారమిస్తారు. మత్స్యకారులకు పూర్తిగా వలలు దెబ్బతినివుంటే రూ.50 వేలు, స్వల్పంగా దెబ్బతిన్న పడవలకు రూ.15 వేలు, వల్లం తరహా పడవలకు గరిష్ట పరిహార మొత్తాన్ని రూ.లక్షకు పెంచి ఇవ్వనున్నారు. పూర్తిగా దెబ్బతిన్న మర పడవలకు రూ.7.5 లక్షల చొప్పున పరిహారమిస్తారు.

రూ.25 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు

- 1 నుంచి ఆరోగ్య సురక్ష రెండవ దశ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పరిమితిని 25 లక్షల రూపాయలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు ఆరోగ్య శ్రీ పరిధి రూ.5 లక్షల లోపు ఉన్న సంగతి తెలిసిందే. దీనిని 25 లక్షల రూపాయలకు పెంచడంతో పాటు, 754 వరకు ఉన్న రోగాల జాబితాను 3,257కు పెంచనుంది. జనవరి ఒకటవ తేది నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష రెండవ దశ కార్యక్రమంలో భాగంగా ఈ నిర్ణయం అమలులోకి రానుంది. ఈనెల 18 నుంచి కొత్త ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణిని ప్రభుత్వం చేపట్టనుంది. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్య శ్రీ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం 1.42 కోట్ల కార్డుల ముద్రణకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది. సచివాలయాల వారీగా ప్రతి ఒక్కరికి నూతన కార్డులు అందించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో వైద్యం పొందుతున్న అందరి వివరాలను డిజిటలైజ్ చేయనున్నారు.

మట్టి పెళ్లలు మీద పడి కార్మికుడి మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

పొట్ట చేతపట్టుకుని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలి పనికి వచ్చిన కార్మికుడు ఓ స్టోన్‌క్రషర్స్‌లోని రాంప్ వద్ద ఉండగా మట్టి పెళ్లలు విరిగిపడి అక్కడికక్కమే మృతిచెందారు. ఈ సంఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్‌యాదవ్ (36) తన భార్య, పిల్లలతో కలిసి స్థానికంగా ఉన్న బాబా స్టోన్‌క్రషర్స్‌లో మూడు సంవత్సరాల నుంచి క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు పనిలేకపోవడంతో శనివారం తిరిగి పనికి వచ్చారు. తన సోదరుడితో కలిసి క్రషర్స్‌లో ఉండే ర్యాంప్ వద్ద అర్జున్ నిల్చొని ఉన్నారు. వర్షానికి ర్యాంప్ వద్ద ఉన్న మట్టిపెళ్లలు ఒక్కసారిగా కిందకు జారిపడ్డాయి. అక్కడే ఉన్న అర్జున్ మట్టిపెళ్లల్లో కూరుకుపోయారు. డోజర్‌తో మట్టిని తొలగించగా అప్పటికే ఊపిరాడక అర్జున్ మరణించారు. క్రషర్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో ఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ముందు ఉద్యోగాల భర్తీ డ్రామా : గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎన్నికలకు రెండు నెలల ముందు గ్రూప్-1, 2 నోటిఫికేషన్ల జారీ పేరుతో సిఎం జగన్ రాష్ట్రంలో మరో కొత్త మోసానికి తెరలేపారని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఆయన తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. ఉద్యోగాల భర్తీని కూడా రాజకీయ ఎత్తుగడగా వాడుకుంటూ ఇష్టానుసారంగా నోటిఫికేషన్లు జారీ చేస్తూ నిరుద్యోగుల భవిష్యత్తుతో వైసిపి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే నిరుద్యోగులు పడిన కష్టం బూడిదలో పోసిన పన్నీరేనని అన్నారు. ఇదంతా ఎన్నికల జిమ్మిక్కేనని ఎద్దేవా చేశారు. గతంలో 2021లో జాబ్ క్యాలెండర్ కింద ప్రకటించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను తాజాగా విడుదల చేశారని, కొన్ని నెలల కిందట ప్రకటించిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను శుక్రవారం జారీ చేశారని నిందించారు. డిఎస్‌సి అంటూ ఊదరగొట్టి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి చివరికి ఆ ఊసే లేకుండా చేశారని వైసిపి ప్రభుత్వాన్ని గంటా విమర్శించారు.

కంటితుడుపు హామీలు

(మొదటిపేజీ తరువాయి)

చలనం లేదు.

12 నుంచి కేంద్ర బృందాలు

కరువుపై క్షేత్ర స్థాయి పరిశీలనకు ఈ నెల 12 నుంచి కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. ఎపి ప్రభుత్వం ప్రకటించిన మండలాలను కేంద్ర అధికారులు సందర్శిస్తారు. వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో పది మంది అధికారుల బృందం మూడు టీంలుగా విడిపోయి రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తుంది. ఈ నెల 15న అమరావతిలో ముఖ్యమంత్రిని లేక చీఫ్ సెక్రటరీతో కేంద్ర అధికారులు సమావేశమవుతారు. ఖరీఫ్‌లో వచ్చిన కరువు పరిశీలనకు సీజన్ ముగిసిన రెండున్నర మాసాల తర్వాత కేంద్ర బృందాలు వస్తున్నాయి. తుపాన్‌పై రాష్ట్ర సర్కారు అంచనాలు, కేంద్ర బృందాల పర్యటనలు, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులు, బీమా క్లెయిముల ఖరారు ఇత్యాది సహాయ చర్యలు ఎప్పటికి చేపడతారోనన్న ఆందోళనలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

విద్యారంగ పరిరక్షణకు సామాజిక ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ ఎన్‌జిపి-2020 పేరుతో దేశంలో ఏ రాష్ట్రంలోనూలేని విధంగా విద్యారంగంలో విధ్వంసాన్ని రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాల్లో విలీనం చేయడంతో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. మాతృభాష బోధన మాధ్యమంగా లేని విధంగా ఈ రాష్ట్రాన్ని తయారు చేశారని, ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఉండాలని వివరించారు. జిల్లా జెఎసి చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు ప్రజలతో కలిసి ఓటు హక్కు ద్వారా ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ మెరుగైన సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, మానవ విలువలు పెంపొందించాలని సూచించారు.

తుపాను, కరువు నష్టాలపై

నిర్లక్ష్య వైఖరి వీడండి

- అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అఖిలపక్ష నేతలు

రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను, కరువు నష్టాలపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. ఈ నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి తక్షణ సాయంగా వెయ్యి కోట్ల రూపాయలు, పూర్తిసాయంగా రూ.10 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని అఖిలపక్ష నేతలు కోరారు. శనివారం విజయవాడ దాసరిభవన్లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. మెట్ట ప్రాంత రైతులు కరువుతో, ఆయకట్టు ప్రాంత రైతులు తుపానుతో తీవ్ర ఇక్కట్లు పాలైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సమావేశం కోరింది. కరువు, తుపాను వల్ల నష్టపోయిన రైతులను, వ్యవసాయ కార్మికులు, వరద బాధితులను ఆదుకోవాలని పంట నష్టాలను అంచనా వేయించి, రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తుపాను, కరువు నష్టాన్ని కేంద్రం జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి రూ.1000 కోట్లు తక్షణ సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాలకుపైగా అపార నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం మాత్రం 1.47 లక్షల హెక్టార్లలో మాత్రమే పంట నష్టం జరిగిందని ప్రకటించడం దారుణమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మొదలుకుని శ్రీకాకుళం జిల్లా వరకు తీర ప్రాంత జిల్లాలో లక్షలాది ఎకరాల పంటలు నీటమునిగాయని చెప్పారు. నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలు జరగకుండా ఎన్యూమరేషన్ చేయాలని, కౌలు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి గ్రామంలో రైతు సంఘాల బాధ్యులు, తదితరులతో కలిపి ఎన్యూమరేషన్ కమిటీ వేయాలని సూచించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పంటలు పూర్తిగా నీటమునిగి రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వానికి దోచుకోవడం తప్ప రైతులు, ప్రజలను కాపాడాలనే ఆలోచన లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 11వ తేదీన అన్ని జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 14వ తేదీన కలెక్టరేట్ల ముందు నిరసనలు చేపట్టనున్నట్లు సిపిఐ నాయకులు తెలిపారు. ఆమ్ ఆద్మీ నాయకులు జిఎస్ ఫణిరాజ్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు డి.హరనాథ్, ఎంసిపిఐయు రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాషా, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, కె.వి.వి.ప్రసాద్, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

ప్రారంభం కాని ఎన్యూమరేషన్

- నష్టం తేల్చాలని జిల్లాకు ఆదేశాలు జారీ చేయని ప్రభుత్వం
- వెలువడని మార్గదర్శకాలు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మిచౌంగ్ తుపాను వల్ల పంటల వారీగా, రైతుల వారీగా నష్టం అంచనాలు తయారు చేసే ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇంతవరకూ ప్రారంభం కాలేదు. దీంతో, రైతులు ఆందోళనతో ఉన్నారు. నష్టం తీవ్ర కనిపిస్తున్నప్పుడే అంచనా వేస్తే తమకు న్యాయం జరిగే అవకాశం ఉందని, లేకపోతే అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన వరి చేలల్లో చేరిన నీటిని బయటకు తీసే, తడిచిపోయిన ధాన్యాన్ని, వరి పనలను ఆరబెట్టుకొనే పనిలో ఉన్నారు. పడిపోయిన వరిలో నీరు ఉండగానే అంచనా వేస్తే నష్టం తీవ్రత తెలుస్తుందని అంటున్నారు. నీరు బయటకుపోయాక అధికారులు వచ్చినా ఫలితం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు ద్వారా నష్టం అంచనాలను రూపొందించిన నివేదిక పంపాలని ఇచ్చిన ఆదేశాలే తప్ప, ఇంత వరకు మార్గదర్శకాలు వెలువడ లేదు. గతంలో ఉన్న మార్గదర్శకాల ప్రకారమే పంట నష్టం నమోదు చేస్తామని అధికారులు చెప్తున్నారు. 35 శాతం కన్నా ఎక్కువ నష్టం ఉంటేనే వివరాలు నమోదు చేస్తామని అంటున్నారు. నీట మునిగిన పంటల వివరాలను వ్యవసాయ శాఖాధికారులు మాత్రమే లెక్కలు వేశారు. వాటినే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. రైతులను ఆదుకోవాలన్నా, పరిహారం ఇవ్వాలన్నా తక్షణం ఎన్యూమరేషన్ జరగాలి. ఆదేశాలు రాగానే ఎన్యూమరేషన్ మొదలు పెడతామని, ఆర్థిక నష్టం ఎంతనేది తేల్చనున్నామని అధికారులు చెప్తున్నారు. బాపట్ల జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా తేల్చారు. మొత్తం పంటలు 3.80 లక్షల ఎకరాల్లో వేయగా 2.5 లక్షల ఎకరాలు దెబ్బతిన్నాయి. ప్రకాశం జిల్లాలో పొగాకు పంట 25 వేల ఎకరాల్లో దెబ్బతింది. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాల్లో వరి పంట, 750 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా తేల్చారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఎన్యుమరేషన్ ప్రక్రియ చేపడతామని అధికారులు తెలిపారు. తుపాను వల్ల పంటల నష్టం నమోదును సోమవారం నుంచి ప్రారంభించేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఈ నెల 11 నుంచి అధికారులు పంట నష్టం సర్వే నిర్వహిస్తారని ఆయా జిల్లాల అధికారులు తెలిపారు. తిరుపతి జిల్లాలోనూ ఎన్యూమరేషన్ ప్రారంభం కాలేదు.

గుంటూరు జిల్లా పొన్నూరుకు సమీపంలోని కంటిపూడి వద్ద పొలాల్లో తొలగనినీరు

ఏలూరు జిల్లాలో...

ఏలూరు జిల్లాలో ప్రాథమిక అంచనాల ప్రకారం దెబ్బతిన్న వరి పంటకు సంబంధించి 41,473 ఎకరాల్లో ముప్పు వాటిల్లిందని, మొక్కజొన్న 8,486 ఎకరాలు, మినుము 4101 ఎకరాలు, పెసలు 5,886 ఎకరాలు, వేరుశెనగ 930 ఎకరాలు, పొగాకు 4,352 ఎకరాలు, పత్తిపంట 2,827 ఎకరాలు మొత్తంగా 68,052 ఎకరాలు పంట దెబ్బతిన్నట్లు తేల్చారు. ఈ నెల 12వ తేదీకి ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయని, ప్రత్యేక టీములు ఈ ప్రక్రియను ప్రారంభించాయని అధికారులు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న జగన్

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం శీలంవారిపాకలు జంక్షన్ నుంచి 217వ రోజు యువగళం పాదయాత్ర పున:ప్రారంభమైంది. తుపాను నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి యాత్రను నిలిపేశారు. తిరిగి శనివారం లోకేష్ యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా తునిలో మత్స్యకారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఫార్మా, కెమికల్ కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలవడంతో మత్స్య సంపద తగ్గిపోతోందన్నారు. టిడిపి హయాంలో బోట్లు, వలలు, జిపిఎస్ ఇతర సామగ్రి సబ్సిడీలో అందించే వారమన్నారు. ప్రస్తుత సర్కారు వాటికి తిలోదకాలిచ్చిందని విమర్శించారు. కాకినాడ సెజ్‌లో ఉన్న కంపెనీల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇస్తామని జగన్ హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కెమికల్, ఫార్మా కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలవకుండా పొల్యూషన్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గం కోనపాపపేటలో హేచరీస్ యజమానులతో లోకేష్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి జె-ట్యాక్స్ విధానాల కారణంగా ఆక్వారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. సీడ్, ఫీడ్, మందుల ధరలు, కరెంటు ఛార్జీలు పెంచి ఆక్వా రైతులను అప్పుల్లో ముంచేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాభివృద్ధికి ఉపకరించే ప్రధాన ప్రాజెక్టులకు భూములను త్యాగం చేసిన శ్రీరాంపురం గ్రామ రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కాకినాడ సెజ్ ప్రాంతంలో పరిశ్రమలు రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని, వాటిలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్.వర్మ, వనమాడి కొండబాబు ఇతర టిడిపి నాయకులు ఉన్నారు.

మత్స్యకారులు బహూకరించిన వల, చేప, మత్స్యకారుల టోపీతో లోకేష్

జగన్ పాలనలో దళితులపై దాడులు : కెఎస్ జవహర్

జగన్ తన పాలనలో దళితులపై ఆరు వేలకు పైగా దాడులు చేయించారని మాజీమంత్రి కెఎస్ జవహర్ ఆరోపించారు. 28 మంది దళితులు హత్యకు గురయ్యారని అన్నారు. రక్తపాతంతో తనకు ఓట్లేసిన దళితులకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలోనూ ఉచిత ప్రయాణం

- ఐద్వా విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోనూ మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన రాష్ట్రాల్లో తెలంగాణ 5వ రాష్ట్రం అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం చాలా ప్రయోజనకరంగా ఉందని తమిళనాడు ప్లానింగ్ కమిషన్, సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిల్ అక్షన్ గ్రూప్ (సిఎజి) సర్వే ప్రకటించిందని తెలిపారు. మానవాభివృద్ధిలోనూ, మానవ సంబంధాల మెరుగుదలలోనూ ఉచిత ప్రయాణం మంచి ప్రభావం చూపుతుందని తెలిపిందని పేర్కొన్నారు. దీనివల్ల ఆయా రాష్ట్ర ఉత్పత్తిలో మహిళా భాగస్వామ్యం పెరిగిందని ప్రపంచబ్యాంక్ నివేదిక కూడా స్పష్టం చేసిందని తెలిపారు.

అక్క చెల్లెమ్మల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నానని చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రకటించి అమలు చేయాలని కోరారు. పెరిగిన ప్రయాణికుల అవసరాల మేరకు బస్సుల సంఖ్య పెంచాలని, ఉచిత ప్రయాణానికి అయ్యే ఖర్చును రాష్ట్రప్రభుత్వాలు చెల్లించాలని కోరారు. తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాయని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం కూడా రైలు ప్రయాణాలలో రాయితీలిచ్చి ప్రయాణికులకు సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు.

ప్రజలే అంబాసిడర్లు

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - విజయవాడ, అమరావతి బ్యూరో

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే అంబాసిడర్లని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకం లబ్ధిపొందకుండా మిగిలిపోకూడదనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రాయనపాడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఇసి) వాహనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల 2.0, పిఎం ఆవాస్ యోజన తదితర స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా సమాజానికి భిన్న మార్గాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. అనంతరం జరిగిన సభలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. వివక్షకు తావులేకుండా సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి పేదవాని అభివృద్ధికి అన్ని సదుపాయాలూ అందించాలన్న ఉద్దేశంతో వివిధ పథకాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని చెప్పారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వీటిపై అవగాహన పెంపొందించుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఉమ్మడి కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

కొవ్వూరు రైల్వే స్టేషన్ హాల్ట్‌ను పునరుద్ధరించండి
నిర్మలా సీతారామన్‌కు హోమ్‌మంత్రి తానేటి వనిత వినతి

కోవిడ్ నేపథ్యంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్ల హాల్ట్‌లను రద్దు చేశారని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విజయవాడకు వచ్చిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వనిత కలిసి వినతిపత్రం సమర్పించారు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో రెగ్యులర్‌గా నిలుపుదల చేయాల్సిన రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, తిరుపతి, చెన్నై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండటంతో పాటు రాజమండ్రికి వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోందని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్ కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కొవ్వూరు స్టేషన్‌లో నిలుపుదల చేయాల్సిన రైళ్ల జాబితాను వినతిపత్రంతో కలిపి అందజేశారు.

విశాఖ ఉక్కుకు కేంద్రం తూట్లు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నడవడికకు అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1031వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ 1 కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షకు తూట్లు పొడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాకతప్పదన్నారు. ప్లాంట్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి నష్టాలు దిశగా నెట్టింది కేంద్ర ప్రభుత్వమేనని తెలిపారు. అందుకు సహకరిస్తున్న రాజకీయ పార్టీల నేతలు చరిత్ర హీనులుగా మిగులుతారన్నారు. లాభాల బాటలో ఉన్న పరిశ్రమను కేంద్రం ఎలా నష్టాల్లోకి నెట్టిందీ వివరించారు. ఐదు లక్షల మందికి జీవనాధారమైన స్టీల్‌ప్లాంట్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే రాష్ట్ర పాలకులు చోద్యం చూస్తున్నారని అన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయని, ఉన్న పరిశ్రమను కాపాడలేని వీరి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, కారు రమణ, రాజబాబు, ఎంవి.రమణ, సుబ్బయ్య, సిహెచ్.కల్యాణ్, పివి.రమణమూర్తి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఉచిత ప్రయాణం కోసం జీరో ఛార్జీ టికెట్‌ను చూపిస్తున్న మహిళలు

వంద రోజుల్లో అమలు

- ఆరు గ్యారంటీలపై తెలంగాణ సిఎం రేవంత్
- 'మహాలక్ష్మి' పథకానికి శ్రీకారం
- 'ఆరోగ్యశ్రీ' పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్లు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'మహాలక్ష్మి' పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచుతూ ప్రకటన చేశారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇకపై మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ నుంచి ఎక్కడికైనా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచుతున్నామని ప్రకటించారు. చేయూత పథకం కింద వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్, కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం రూ.2 కోట్ల చెక్‌ను అందించారు. తెలంగాణ ప్రజల కోసం సోనియమ్మ ఆరు గ్యారంటీలను ఇచ్చారని, అందులో రెండు గ్యారంటీలను ఆమె పుట్టినరోజు నాడే ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని, తెలంగాణను సంక్షేమ, అభివృద్ధి రాజ్యంగా మారుస్తామని అన్నారు.

జీరో ఛార్జీ టికెట్
'ఆరోగ్యశ్రీ' లోగో ఆవిష్కరణ

మహాలక్ష్మి ఉచిత ప్రయాణం కోసం జీరో ఛార్జీ టికెట్‌ను, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం లోగో, పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పథకాల ప్రారంభం అనంతరం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి, సిఎస్ శాంతికుమారి, డిజిపి రవిగుప్తా, ఆర్‌టిసి ఎండి సజ్జనార్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర అధికారులతో కలిసి అసెంబ్లీ ఆవరణ నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు బస్సులో ఆయన ప్రయాణం చేశారు. సిఎం రూ.10 చెల్లించి కండక్టర్ నుంచి టికెట్ తీసుకున్నారు.

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టడంతో కొత్త పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండో గేటు శుక్రవారం కొట్టుకుపోవడంతో రబీలో సేద్యానికి ఈ రిజర్వాయర్ కింద ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి కనబడడం లేదు. మొదటి సారి గేటు కొట్టుకుపోయినప్పుడే ప్రభుత్వం స్పందించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం మూడు టిఎంసిలు. దీనికి 15 గేట్లు ఉన్నాయి. శుక్రవారం నాటి ఘటనతో సుమారు రెండు టిఎంసిల నీరు సముద్రం పాలైంది. ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు డిసెంబరులోపు గుండ్లకమ్మ మరమ్మతులు చేపట్టి సాగర్ జలాలను అందిస్తామన్న హామీ గంగలో కొట్టుకుపోయింది. రిపేర్ల కోసం ఆరుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు వరద నీరు భారీగా వచ్చి చేరింది. జలాశయం నిండుకుండగా మారింది. వరద నీటి ఉధృతికి ఒక్కసారిగా రెండో గేటు కింద భాగం కొట్టుకుపోయింది. గేటు నుంచి భారీగా దిగువకు వెళ్లిపోతున్న నీటిని ఆపేందుకు ఇంజనీరింగు అధికారులు యత్నిస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గితే తప్ప అక్కడ తాత్కాలికంగా ఎలిమెంట్లు అమర్చే పరిస్థితి లేదు. దీంతో, కొన్ని గేట్లు కొద్దిగా ఎత్తి నీటిని వృథాగా సముద్రంలోకి దిగువకు వదులుతున్నారు. దీంతో, రిజర్వాయర్ ఇప్పటికే సగం ఖాళీ అయింది. గుండ్లకమ్మ కుడిఎడమ కాలువ ద్వారా రబీలో 80 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు నీరివ్వడానికి సరిపడా నీరు రిజర్వాయర్‌లో ఉండేది. ఈ ఏడాది ఖరీఫ్, రబీని కరువు వెంటాడింది. డిసెంబర్‌లో వచ్చిన తుపాను వల్ల డ్యాము నిండడంతో పొగాకు, మిర్చి పంటలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశించారు. ఈ గేటు కొట్టుకుపోవడంతో వారి ఆశలన్నీ నీరుగారాయి. ఈ నేపథ్యంలో రూ.9 కోట్లతో టెండర్లు ఫైనల్ అయినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం రాత్రి ప్రకటించారు.

పత్తాలేని పాలకపక్ష నేతలు...

డ్యామ్‌ను సందర్శించిన రైతు, కౌలు సంఘాల నాయకులు

గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోవడంతో పాలకపక్ష నేతలు ఎవరూ కనిపించలేదు. ఎపి రైతు, ఎపి కౌలు రైతు సంఘాల నేతలు పమిడి వెంకట్రావు, ఎస్‌కె మాబు, జె.జయంతిబాబు, బాలకోటయ్య తదితరులు కొట్టుకుపోయిన గేటును శనివారం పరిశీలించారు. సంతనూతల పాడు వైసిపి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తన అతిథి గృహం నుంచి ఇదే మార్గంలో వెళ్లినా ఇటువైపు కన్నెత్తి చూడలేదు. మంత్రిగానీ, జిల్లాలోని సీనియర్ ఎమ్మెల్యేలుగానీ పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డోలా వీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యేలు బిఎన్ విజయకుమార్, ముత్తుమల అశోక్‌రెడ్డి, తక్షణం మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఈ విపత్తు జరిగిందన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేయించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్ట్ రెండో గేట్ కింది భాగం వరద నీటికి విరిగిపోయిందని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. నీరంతా సముద్రం పాలవుతుండటంతో ఈ ఏడాదంతా ఆయకట్టు రైతులందరికీ గడ్డుకాలమవుతుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 30న మూడో నెంబర్ గేట్ కొట్టుకుపోయినా ఇంతవరకు కొత్తగేటు అమర్చలేదని, తాజాగా 2వ నెంబర్ గేట్ దిగువ భాగంలో నాలుగు మీటర్లకు పైగా విరిగిపోయిందని తెలిపారు. గేటు మరమ్మతులు చేయించాలని రైతు సంఘాలు ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా ప్రభుత్వం, నీటి పారుదల అధికారులు స్పందించకుండా నిర్వహణను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే రూ.10 కోట్లు నిధులు కేటాయించి శాశ్వతంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు రిపేర్లు, కొత్త గేట్లు ఏర్పాటుచేసి ఆయకట్టు రైతాంగాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

నాలుగేళ్లలో 2.17 లక్షల కోట్ల రుణం

కేంద్రానికి వివరించిన రాష్ట్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో 2.17 లక్షల కోట్ల రుపాయల అప్పు చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి తెలియచేసింది. కొద్దిరోజులుగా కేంద్రం రాష్ట్రం చేసిన రుణాలపై వివిధ రూపాల్లో ఆరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ గడిచిన నాలుగేళ్ల కాలంలో చేసిన రుణాల వివరాలను ప్రకటించింది. నాలుగేళ్లలో తీసుకున్న రుణాలు, ఏయే రంగాల ద్వారా ఎంత తీసుకున్నారు తదితర అంశాలను వెల్లడించింది. ప్రభుత్వ సెక్యూరిటీలను తనఖా పెట్టడం ద్వారా నేరుగా రిజర్వ్‌బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలతోపాటు, నబార్డ్, హడ్కో, ఎల్ఐసి, ఎన్‌సిడిసి వంటి సంస్థల నుంచి, ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల కోసం సేకరించిన రుణాలను కూడా రాష్ట్ర ఆర్థికశాఖ ప్రకటించింది. 2019-20 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం 2,17,883 కోట్లు రుణాలుగా సేకరించినట్లు ఆర్థికశాఖ వెల్లడించింది. ఇందులో ఒక్క రిజర్వ్‌బ్యాంకు నుంచి సెక్యూరిటీల వేలం ద్వారా నుంచే 1,97,232 కోట్లు సమీకరించారు. అలాగే నబార్డ్ నుంచి 7,122 కోట్లు, సంస్థల నుంచి 6,509 కోట్లు, ఇఎపి వంటి వాటికి 7,020 కోట్లు తీసుకున్నట్లు ఆర్థికశాఖ వెల్లడించింది.

పలు మార్గాల్లో రుణాలు (రూ, కోట్లలో)

ఏడాది	ఆర్‌బిఐ నుంచి	నబార్డ్	సంస్థలనుంచి	ఇతర, ఇఎపి
2019-20	41,415	1,200	641	22,030
2020-21	50,896	1,977	---	1,563
2021-22	46,443	1,945	---	1,122
2022-23	57,478	2,000	96	2,305
మొత్తం	1,97,232	7,122	6,509	7,020

జిఎస్‌డిపిలో 33.7 శాతంగా

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలు ప్రవస్తుతం జిఎస్‌డిపిలో 33.7 శాతంగా ఉన్నట్లు ఆర్థికశాఖ పేర్కొంది. 2019-20లో 27.9 శాతంగా ఉండగా, 2020-21లో 34.7 శాతానికి పెరిగింది. తరువాత 2021-22లో 35.6 శాతానికి పెరగ్గా, 2022-23లో స్వల్పంగా తగ్గి 33.7 శాతానికి చేరుకున్నట్లు వెల్లడించింది. అలాగే రిజర్వ్‌బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల్లో ఇప్పటివరకు 41,374 కోట్లు తిరిగి చెల్లింపులు చేసినట్లు తెలిపింది.

బంగారు దుకాణాల్లో ఐటి సోదాలు

- పలు రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని పలు బంగారం దుకాణాల్లో శనివారం ఉదయం నుంచి ఆదాయ పన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బంగారం అక్రమ రవాణా, నకిలీ బంగారం మార్పిడి వంటి విషయాలను పరిశీలించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. నగరంలోని మహాత్మాగాంధీ రోడ్‌లోని రెండు దుకాణాల్లో సోదాలు జరిగాయి. ఆంజనేయ జ్యూవెలరీ, బాంబే జ్యూవెలరీ షోరూం తలుపులు మూసేసి పలు రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ సలహాదారుల నియామకాలు రద్దు

- తెలంగాణ సిఎస్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రభుత్వ సలహాదారుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సలహాదారులుగా నియమితులైన సోమేశ్‌కుమార్, చెన్నమనేని రమేష్, రాజీవ్ శర్మ, అనురాగ్ శర్మ, ఎకె ఖాన్, జిఆర్ రెడ్డి, ఆర్.శోభ నియామకాలను ప్రభుత్వం రద్దు చేసింది.

బిఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఎన్నుకున్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కొత్తగా ఎన్నికైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఎల్‌పి నేతగా కెసిఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలను గెలుచుకొని బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష హోదాలో నిలిచిన సంగతి తెలిసిందే. కెసిఆర్‌కు శస్త్రచికిత్స జరిగిన కారణంగా శనివారం నాటి సమావేశానికి హాజరు కాలేదు. మిగిలిన ఎమ్మెల్యేలు పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఎల్‌పి సమావేశం ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి వెళ్లారు. బిఆర్ఎస్ఎల్‌పి భేటీకి కెటిఆర్, పద్మారావు, ముఠా గోపాల్ హాజరుకాలేదు.

సెక్షన్ 30 అమలుపై...
నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు

- 13న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం
- 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' నిర్ణయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాజ్యాంగబద్ధంగా పాలన కొనసాగినప్పుడే ప్రజలకు సుపరిపాలన అందుతుందని 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాసంఘాలపై నిర్బంధం విధిస్తూ సెక్షన్ 30 అమలుపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' కార్యవర్గం నిర్ణయించిందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నిమ్మగడ్డ మాట్లాడుతూ.. హింసకు తావులేకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ ఎన్నికలు జరుపుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల కార్యకర్తలపై ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులను బనాయించడంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30ను నిరవధికంగా అమలు చేయడంపై, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులపై, కార్యకర్తలపై పెడుతున్న పోలీసు కేసులలోని వాస్తవాలను తెలుసుకోవడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కోసం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా పనిచేసిన సీనియర్ ఐపిఎస్ అధికారి ఎంవి. భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ పూర్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ అనగాని సత్య ప్రసాద్, హిందూ దినపత్రిక పూర్వ రెసిడెంట్ ఎడిటర్ వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలో పర్యటించి విభిన్న వర్గాల వారితో సంప్రదింపులు జరిపి కేసు మోపబడిన వారి వద్ద నుండి వాస్తవాలను సేకరించనుందని తెలిపారు. ఈ నెల 13న విజయవాడలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఆర్ఎస్ అధికారి పి. రఘు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జాయింట్ సెక్రటరీ లక్ష్మణ రెడ్డి, సిటిజన్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి ఫల్గున కుమార్ పాల్గొన్నారు.

డబ్బుల్లేకుండా రాజకీయాలు నడపలేం

- నేనేమీ నీతివంతుణ్ణని చెప్పడంలేదు
- ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి
- మాజీ మంత్రి బాలినేని ఉవాచ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తానేమి నీతిపరుడినని చెప్పడం లేదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే, ఒంగోలు నియోజకవర్గంలో తాను ఎక్కడా డబ్బులు తీసుకోలేదన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు బయట ఎక్కడైనా డబ్బులు ఇస్తే తీసుకున్నానని చెప్పారు. అలా తీసుకోకపోతే తాను రాజకీయాలు నడపలేనని తెలిపారు. ఒంగోలులో ఎన్‌టిఆర్ కళాపరిషత్‌లో 'అన్న' సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా చేసిన తాను సంపాదించింది ఏమీ లేదన్నారు. వాస్తవానికి అప్పులు చేసి రాజకీయాలు చేస్తున్నానని చెప్పారు. గత ఎన్నికల్లో కూడా ఎన్నికల ఖర్చు తన వియ్యంకుడు పెట్టారని తెలిపారు. 'మొన్న జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నేను రూ.50 లక్షలు బెట్టింగ్ వేశాను. మా అబ్బాయి బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని నాతో వాదించాడు. తనని బాధపెట్టకూడదనే బెట్టింగ్‌ను క్యాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది' అని తెలిపారు.

ప్రస్తుత రాజకీయాలు ఇరిటేటింగ్‌గా ఉన్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఒక సామాజిక తరగతి వాళ్లు రోడ్ల మీదకు వచ్చి పనిచేస్తారని, వైసిపి క్యాడర్ అంతా కలిసికట్టుగా పనిచేస్తానంటేనే ఈ ధపా ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని, లేకపోతే పోటీ చేయనని బాలినేని చెప్పారు. మంచిగా ఉండి రాజకీయాల నుంచి తప్పుకోవాలని అనుకుంటున్నానని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలు తన కుటుంబాన్ని బాధిస్తున్నాయని, ఈ క్రమంలో తన కుమారుడిని రాజకీయాలలోకి తేవాలా..? వద్దా.? అనే ఆలోచనలో పడే పరిస్థితి ఉందన్నారు. తాము ఏం చేయకపోయినా తమ మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి అప్పలరాజును కాన్వాయ్‌ని అడ్డుకున్న పోర్టు నిర్వాసితులు

మంత్రి అప్పలరాజుకు చేదు అనుభవం

- హామీలు నెరవేర్చకపోవడంపై పోర్టు నిర్వాసితుల నిలదీత

ప్రజాశక్తి- నౌపడ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు వద్ద మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు శనివారం చేదు అనుభవం ఎదురైంది. పోర్టు పనుల నిర్మాణ ప్రగతిని పరిశీలించడానికి ఆయన వచ్చారు. పోర్టు ముఖద్వారం వద్ద ఆయన కాన్వాయ్‌ని నిర్వాసితులు అడ్డుకున్నారు. దీంతో, మంత్రి వాహనం దిగి వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా, నిర్వాసితులు శాంతించలేదు. ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయాలని నిలదీశారు. చాలామందికి ఇంతవరకూ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం ప్యాకేజీ (పిడిఎఫ్‌లు) పడలేదని, జీడి మొక్కలకు పరిహారం ఇవ్వలేదని, ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు నిర్వాసిత కాలనీ ఎత్తు పెంచాలని కోరినా జిల్లా అధికారుల్లో స్పందన లేదన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని, ఇతరులకు నెలకు రూ.18 వేలు జీతం ఇస్తున్నారని, అదే పనిచేస్తున్న స్థానికులకు మాత్రం రూ.9 వేలు ఇస్తున్నారని, వీటిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. పోర్టు నిర్మాణ పనుల పరిశీలన అనంతరం మాట్లాడుకుందామని మంత్రి అనగా... ఇక్కడ కాదని, మూలపేటలో ప్రజల సమక్షంలో సమావేశం పెట్టి సమాధానం చెప్పాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించడానికే తాను, కలెక్టర్ ఇక్కడికి వచ్చామని, సమస్యలు చర్చించుకునే పద్ధతి ఇది కాదని, బహిరంగంగా మాట్లాడితే ఈ విషయాన్ని పత్రికలు రాద్ధాంతం చేస్తాయని మంత్రి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అనంతరం పోలీసుల సహకారంతో పోర్టులోకి వెళ్లిన మంత్రి చాలా సమయం వరకూ బయటకు రాలేదు. దీంతో, నిర్వాసితులు అక్కడి నుంచి వెనుదిగిరారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి పోర్టు నుంచి బయటకు వచ్చి తిరుగు పయనమయ్యారు.

రూ.600 తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : బంగారం ధరల్లో తగ్గుదల చోటు చేసుకుంది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.600 తగ్గి రూ.62,500గా నమోదయినట్లు గుడ్‌రిటర్న్ వెల్లడించింది. 22 క్యారెట్లపై రూ.550 తగ్గి రూ.57,300గా పలికిందని పేర్కొంది. కిలో వెండిపై రూ.2000 తగ్గి రూ.78వేలుగా నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గాయి. అమెరికాలో ఉపాధి కల్పన పెరగడానికి తోడు బాండ్లపై రాబడి పెరగడంతో బంగారానికి డిమాండ్ తగ్గింది. దీంతో శుక్రవారం సెషన్‌లో ఒక్క ఔన్స్ పసిడిపై 1 శాతం మేర ధర పతనమై 2వేల డాలర్లుగా పలికింది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
చినఅవుటపల్లి బ్రాంచ్ (13368)
చినఅవుటపల్లి, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్,
☎ 08676-257264, 9440905164

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
(1) శ్రీ చొప్పర స్టాలిన్, తండ్రి: జ్ఞాన సుందరరావు, హెచ్ నెం. 11-67, శ్రీరామన్నారాయణ వీధి, అశోక్‌నగర్, విజయవాడ-520007, **(2) శ్రీమతి సుహాసిని చొప్పర, భర్త: లేటు స్టాలిన్,** హెచ్ నెం. 11 167, శ్రీరామన్నారాయణ వీధి అశోక్‌నగర్, కానూరు, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా-520007.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, చినఅవుటపల్లి బ్రాంచ్ నుండి
శ్రీ చొప్పర స్టాలిన్ పొందిన లోన్స్ / ఋణ సౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	వడ్డీతో కలిపి తేది నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
HL లోన్ అకౌంట్ నెం. 33687730000021	రూ.14,93,531.40 తేది: 06.11.2013	రూ. 7,29,110.09	10.95%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 29.11.2023 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.7,29,110.09/- (అక్షరాల ఏడు లక్షల ఇరవై తొమ్మిది వేల నూట పది రూపాయలు మరియు తొమ్మిది పైసలు)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, గన్నవరం గ్రామ పంచాయితీ మరియు గ్రామం, విజిటిఎమ్ ఉడాలో ఆర్.ఎస్.నెం. 385/6, 401/9, 402/11, విజయవాడ ఫైల్ నెం. C2/11727/08 మరియు ఆర్.ఎల్.పి.నెం. 172/2011, ప్లాన్ ప్రకారం ప్లాట్ నెంలు. 27, 28, 38, 39 నందు ఎ. 0.32 సెంట్లు లేదా 1546 చ॥గు॥ (సమీప డి.నెం. 8-198). హద్దులు: తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు – 105.5 అ॥, దక్షిణం: 33 అ॥ వెడల్పు రోడ్డు – 132.0 అ॥, పడమర: 33 అ॥ వెడల్పు రోడ్డు – 105.5 అ॥, ఉత్తరం: ఇతరుల ఆస్తి – 132.0 అ॥.
షెడ్యూల్-బి: పైన తెలిపిన ఎ-షెడ్యూల్ మొత్తం స్థలంలో అవిభాజ్యపు 45.25 చ॥గు॥ లేదా 37.83 చ॥మీ॥ ఉమ్మడి వాటాతో "ఎస్‌విఎస్ హోమ్స్" అపార్ట్‌మెంట్స్, 1వ అంతస్తులో 1050 చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగి (ఉమ్మడి ఏరియా మరియు కారు పార్కింగ్ కలుపుకొని) అసంపూర్తిగానున్న **డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం. 205 అన్ని సౌకర్యాలతో** (గమనిక: ప్రస్తుతం ఫ్లాట్ పూర్తి కాబడినది). **హద్దులు:** తూర్పు: గ్రౌండ్‌లో ఒపెన్ ఏరియా, దక్షిణం: గ్రౌండ్‌లో ఒపెన్ ఏరియా, పడమర: టాట్‌లాట్, ఉత్తరం: ఉమ్మడి వరండా.

తేది: 01.12.2023, ప్రదేశం: చినఅవుటపల్లి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

తెలంగాణ మంత్రులకు శాఖల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ఇందుకోసం శుక్రవారం ఢిల్లీ వెళ్లిన సిఎం..ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు.

అనంతరం మంత్రుల శాఖలపై శనివారం ప్రకటన చేశారు. హోం, పురపాలక, విద్య, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమంతో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలను సిఎం తన వద్దే అట్టిపెట్టుకున్నారు.

మంత్రుల శాఖల వివరాలు

భట్టి విక్రమార్క – ఆర్థిక, ఇంధన శాఖ
తుమ్మల నాగేశ్వరరావు – వ్యవసాయం, చేనేత
జూపల్లి కృష్ణారావు – ఎక్సైజ్, పర్యాటకం
ఉత్తమ్‌కుమార్ రెడ్డి – నీటి పారుదల, పౌరసరఫరాలు
దామోదర రాజనర్సింహ – వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి – ఆర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు – ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి – రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ
పొన్నం ప్రభాకర్ – రవాణా, బిసి సంక్షేమం
సీతక్క – పంచాయతీ రాజ్, మహిళ, శిశు సంక్షేమం
కొండాసురేఖ – అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ

వికటించిన పెళ్లి భోజనం

- మహిళ మృతి,
- ఆరుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)

పెళ్లి భోజనం వికటించి ఓ మహిళ మృతి చెందగా, 20 మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని బహడపల్లి పంచాయతీ పరిధిలోని బొడ్లూరులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మందస మండలంలోని నల్లబొడ్లూరులో ఓ వివాహ వేడుక జరిగింది. మధ్యాహ్నం భోజనాల అనంతరం మిగిలిన ఆహార పదార్థాలు, చికెన్ రాత్రి విందులోకి ఉపయోగించారు. రాత్రి జరిగిన విందులో నల్లబొడ్లూరు, బేతాళపురం గ్రామస్తులు పాల్గొన్నారు. భోజనం అనంతరం వాంతులు, విరోచనలతో అవస్థతకు గురయ్యారు. వెంటనే వారిని కుటుంబ సభ్యులు హరిపురం సిహెచ్‌సి, కాశీబుగ్గ సిహెచ్‌సిలో చేర్పించారు. వీరిలో బేతాళపురానికి చెందిన తెప్పల జానకమ్మ (35) పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రకాష్ వర్మ ప్రథమ చికిత్స అందించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. మార్గం మధ్యలో ఆమె మృతి చెందారు. మిగిలిన సుమారు 20 మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపిపి డాక్టర్ దానయ్య యాదవ్ బాధితులను పరామర్శించి ఓదార్చారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి మంత్రి ఆదేశించారు. మందస ఎస్ఐ సిహెచ్.హరికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రోజా, తదితరులు

క్రీడాకారులు దేశప్రతిష్ట పెంచాలి

- టూరిజం, సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి రోజా
- సౌత్ అండ్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం(తూర్పుగోదావరి)

క్రీడల్లో రాణిస్తూ అంతర్జాతీయంగా దేశప్రతిష్టను పెంచాలని క్రీడాకారులను టూరిజం, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ఆర్‌కె.రోజా కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సౌత్ అండ్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో కలిసి ఆమె శనివారం ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. 12వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. 11 రాష్ట్రాల నుంచి 90 విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 800 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు మహిళల 45 కేజీల విభాగంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థిని బి.రాజేశ్వరి ప్రథమ స్థానం, కోల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ విద్యార్థిని దోనే అపేక్ష దత్తరి ద్వితీయ స్థానం, పూనే సావిత్రి బాయ్‌పూలే యూనివర్సిటీ విద్యార్థిని హర్షద తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో మహారాష్ట్ర నాందేడ్ యూనివర్సిటీ విద్యార్థి ఆకాష్ శ్రీనివాస్ గౌడ్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి ఇ.కోటేశ్వరరావు, తమిళనాడు తిరువల్లూర్ యూనివర్సిటీ విద్యార్థి పి.బాలాజీ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ విసి కె.పద్మరాజు, రాజమహేంద్రవరం ఎంపి మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ధ్యానచంద్ర, సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ విసి జిఎస్ఎన్.రాజు, జెఎన్‌టియుకె విసి విఆర్.ప్రసాదరాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బాడీ మెంబర్, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, వెయిట్ లిఫ్టింగ్ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతను మాకు అంటగడతారా?

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ అసమర్థతను తమ పార్టీ అధినేత చంద్రబాబుకు, తమ పార్టీకి అంటగట్టడం జగన్ పార్టీకి, మీడియాకు అలవాటైపోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్వహణను జగన్ గాలికొదిలేశారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాజెక్టుల గేట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు, మీడియా గగ్గోలు పెట్టినా జగన్ పట్టించుకోలేదన్నారు. గతంలోనే గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు ఒకటి ఊడిందని, ఇప్పుడు మరొకటి ఊడిందని తెలిపారు. కనీసం గ్రీజ్ కూడా గేట్లకు పెట్టడం లేదని విమర్శించారు. ప్రాజెక్టులో మిగిలిన గేట్లకు మరమ్మతులతోపాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల నిర్వహణపైనా సిఎం సమీక్షలు చేసి పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తీరు మారకపోతే ప్రాజెక్టుల వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

దొంగ ఓట్లతో ప్రజాస్వామ్యం ఖూనీ : కిమిడి

దొంగ ఓట్లతో ప్రజాస్వామ్యాన్ని సిఎం జగన్ ఖూనీ చేస్తున్నారని మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి మరీ ఓట్లు తొలగింపు టార్గెట్లు విధించడం దుర్మార్గమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ నిబంధనలు తుంగలో తొక్కుతూ పెద్దఎత్తున ఓట్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో ఇప్పటికే 8.5లక్షల అనర్హుల ఓట్లు ఉన్నాయని వివరించారు.

ATHER

హీరో మోటోతో ఏథర్ ఎనర్జీ జట్టు

న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల తయారీదారు ఏథర్ ఎనర్జీ ఇంటర్ ఫాస్ట్ ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తరణ కోసం హీరో మోటోకార్ప్‌తో భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంలో ఏథర్ ఎనర్జీ ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్‌లను, ఏథర్ గ్రిడ్స్, హీరో మోటోకార్ప్ ఛార్జింగ్ స్టేషన్‌లను సజావుగా ఏకీకృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. కంబైన్డ్ ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇవి వినియోగదారులకు అసమానమైన, సౌకర్యవంతమైన యాజమాన్య అనుభవాన్ని అందించడంలో దిగ్గజ సంస్థగా మారనున్నట్లు పేర్కొంది.

మరో రెండు విడతల్లో పసిడి బాండ్లు జారీ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రెండు విడతల్లో సౌర్వభౌమ పసిడి బాండ్ల(ఎస్‌బిజి)ను జారీ చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. మూడో విడతగా డిసెంబర్ 18 నుంచి 22 తేదీల్లో, నాలుగో విడత బాండ్లను 2024 ఫిబ్రవరి 12 నుంచి 16 తేదీల్లో జారీ చేయనుంది. ఇంతక్రితం జూన్ 19-23, సెప్టెంబరు 11-15 తేదీల్లో బాండ్లను జారీ చేసింది. ఈ బాండ్లను ఎస్‌జిబిలను బ్యాంక్‌లు, తపాళ శాఖ, స్టాక్ ఎక్సేంజీల్లో కొనుగోలు చేయడానికి వీలుంది.

सत्यमेव जयते

భారత రాజపత్రం

అసాధారణం

భాగం–II, సెక్షన్ 3, సబ్–సెక్షన్ (ii)

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, 13 నవంబర్, 2023

ప్రకటన

ఎస్.ఒ. 4903 (ఇ) జాతీయ రహదారుల చట్టం 1956 (48 ఆఫ్ 1956) లోని సెక్షన్ 3ఎ లోని సబ్ సెక్షన్ (1) (ఇకపై సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లాలోని, కాకినాడ పోర్టును జాతీయ రహదారి నెంబర్ 16 కు అనుసంధానం చేయుటలో భాగంగా నిర్మించు జాతీయ రహదారి 516ఎఫ్ లోని వాకలపూడి - అన్నవరం బైపాస్ (కి.మీ 0.000 నుండి 40.621) వరకు నిర్మించు రహదారి (వెడల్పు చేయుట/నాలుగు లేనింగ్ మొ||) నిర్వహణ, మేనేజ్ మెంట్, ఆపరేషన్ కోసం దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని సంతృప్తి చెందిన మీదట సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది. సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 21 రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సిలో సబ్-సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ అధీకృత అధికారికి అంటే జాయింట్ కలెక్టర్, కాకినాడ వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు అధీకృత అధికారి ఆక్షేపణదారుకు స్వయంగా గాని లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించబడేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత అధీకృత అధికారికి అవసరమని భావిస్తే తదుపరి విచారణ తర్వాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా నిరాకరిస్తూ ఉత్తర్వు జారీ చేస్తారు. ఈ ప్రకటన క్రింద తెలియజేసిన భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు అధికృత అధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి. ప్రయోజనం గల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లాలోని, కాకినాడ పోర్టును జాతీయ రహదారి నెంబర్ 16 కు అనుసంధానం చేయుటలో భాగంగా నిర్మించు జాతీయ రహదారి 516ఎఫ్ లోని వాకలపూడి - అన్నవరం బైపాస్ (కి.మీ 0.000 నుండి కి.మీ 40.621) వరకు భూమి స్ట్రెచ్ పరిధిలోనికి వచ్చే కట్టడంతో లేదా కట్టడం లేకుండా సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.

ఫైల్ నెం. NHAI/PIU-RJY/2018-19/KKD-UPP/LA-3A

జిల్లా : కాకినాడ
https://egazette.gov.in
పబ్లికేషన్ తేదీ : 13-11-2023
https://egazette.gov.in/WriteReadData/2023/249335.pdf

https://drive.google.com/file/d/1phVq1ab8HCHOjKbAlhC_e9OhIAMQ7Z39/view?usp=sharing

సంపాదకీయం

బాలల హక్కులు

'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదారేడుల పాపల్లారా/ మెరుపు మెరిస్తే/ వాన కురిస్తే/ ఆకసమున హరివిల్లు విరిస్తే/ అవి మీకే అని ఆనందించే/ కూనల్లారా' అంటాడు శ్రీశ్రీ. బాలలు స్వేచ్ఛా విహంగాలు. బాల్యం అందమైన జ్ఞాపకం. ఏ మనిషి వ్యక్తిత్వం అయినా బాల్యంతో పెనవేసుకునే వికసిస్తుంది. బాలలు దేశ అభివృద్ధికి అతి పెద్ద పెట్టుబడి. మనిషికి గాలి, నీరు, ఆహారం, ఎంత అవసరమో... స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంతే అవసరం. మానవ హక్కులలో ఒక ముఖ్యమైన భాగం బాలల హక్కులు. రక్షణ, విద్య, సంరక్షణ, సామాజిక, సాంస్కృతిక జీవనంలో చురుకైన పాత్ర నిర్వహించే ప్రతి హక్కూ బాలలకు వున్నాయి. 'ప్రతి బిడ్డకూ ప్రతి హక్కు' వుంది. 'చదువని వాడజ్ఞుండగు/ చదివిన సదసద్వివేక చతురత గలుగున్' అంటాడు పోతన. 'చదువు జదవుకున్న/ సౌఖ్యంబులును లేవు/ చదువుజదివెనేని సరసుడగును/ చదువు మర్మమెరిగి చదువంగ చూడుము' అంటాడు వేమన. 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పురుషాళికిన్/ విద్య యశస్సు భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడన్/ విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్/ విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగనివాడు మర్త్యుడే?' అని విద్య ప్రాధాన్యత చెబుతాడు భర్తృహరి. కనుకనే-పిల్లల హక్కుల చట్రంలో అత్యంత ముఖ్యమైన వాటిలో విద్యాహక్కు ఒకటిగా మారింది. అంతేకాదు-సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగే హక్కూ పిల్లలకు వుండాలి.

దాదాపు 45 కోట్ల మంది పిల్లలున్న దేశం మనది. వికసిత భారత్ వంటి ఎన్ని భుజకీర్తులు తగిలించుకున్నా... దయనీయమైన స్థితిలో బతుకుతున్న పిల్లలు లక్షల్లో వున్నారు. బాలికల పరిస్థితి మరింత దుర్భరంగా వుంది. సరైన ఆహారం లేక, ఆశ్రయం లేక, వీధుల్లో బతుకుతూ అనారోగ్యం పాలై, లైంగిక వేధింపులకు గురవుతూ వ్యభిచార కూపంలోకి నెట్టబడుతున్నవారు అనేకమంది వున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు మానవ హక్కులపైనా, బాలల హక్కులపైనా దాడి జరుగుతోంది. యుద్ధం జరుగుతున్న ప్రతి చోటా మొదటి బాధితులు బాలలే. 190కి పైగా దేశాలలోని బాలల సంక్షేమ అభివృద్ధి కోసం పాటు పడే యునిసెఫ్... ప్రతి డిసెంబర్ 11న ఒక కొత్త థీమ్‌ను ప్రకటిస్తుంది. ఈ ఏడాది 'ప్రతి బిడ్డకు... ప్రతి హక్కు' అనే థీమ్ తీసుకున్నారు. జీవించే హక్కు, విద్యాహక్కు, సామాజిక భద్రత హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భావవ్యక్తీకరణ హక్కు, సమానత్వ హక్కు వంటి 40 రకాల హక్కులు బాలలకు వున్నాయి. బాలలను రక్షించేందుకు ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. శరణార్థులుగా మారిన బాలలకు మానవతతో సాయం అందించాలి. మానసిక, శారీరక వికలాంగులైన వారి వృద్ధికి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు చర్యలు తీసుకోవాలి.

'బతుకంటే చావు కాదనీ/ ఆహారమంటే గాలి కాదనీ/ ఈ భూమి ఎవరి సొత్తు కాదనీ/ బతికే హక్కు మీకు వుందనీ మీరు తెలుసుకుంటారు' అంటారో కవయిత్రి. పెద్దలకు హక్కులున్నట్లే, పిల్లలకీ హక్కులున్నాయి. ఆ హక్కులను కాపాడాలి. పడుతూ లేస్తూ పరుగులెడుతూ... పడిపోయిన ప్రతిసారీ కొత్త విషయాలను ఆకళింపు చేసుకుంటూ స్వేచ్ఛగా ఎదగనివ్వాలి. బాల్యం అంటేనే రంగుల హరివిల్లు. అనుభూతుల విరిజల్లు. అదేసమయంలో మింగుడు పడని విషాదాలు, కనబడని కల్లోలాలూ వుంటాయి. అన్నిటినీ తట్టుకుని నిలబడగలిగే విద్య, వివేకం బాలలకు అందించాలి. నేర్చుకోగలిగే సుహృద్భావం, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. వాన కురిసినా, మెరుపు మెరిసినా తమ కోసమే అని ఆనందించే వారి హక్కులను కాపాడాలి. బాలలకు ఉచితంగా విద్యనందించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. వారు స్వేచ్ఛగా చదువుకునే హక్కును కల్పించాలి. వారే రేపటి మన భవిత, భవిష్యత్తూ. 'మీదే మీదే సమస్తవిశ్వం/ మీరే లోకపు భాగ్యవిధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చేనాళ్ల విభాప్రభాతములు' అని శ్రీశ్రీ తన ఆకాంక్ష వ్యక్తం చేస్తాడు. ఆ బాధ్యతను ప్రభుత్వాలు సక్రమంగా నెరవేర్చాలి. బాధాకరమైన విషయం ఏమిటంటే-నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోతున్న, నెత్తురోడుతున్న పాలస్తీనా చిన్నారులకు సంఘీభావం తెలిపేందుకు ముంబయిలోని జహువా బీచ్ వద్ద గుమికూడిన బాలలను కొందరిని అరెస్టు చేశారు. రక్షకులే భక్షకులుగా మారుతున్న ఈ స్థితిలో బాలల హక్కుల కోసం నిలబడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుంది.

మహనీయుల మాట



"సమాజంలో మార్పు రావాలంటే కుల వ్యవస్థ పోవాలి. స్త్రీల స్థాయి పెరగాలి. పురాణాలకు అనుగుణంగా ఆధునిక వ్యవస్థ ఉండాలనుకోవడం తప్పు. చిన్న పిల్లల పెళ్లిళ్లు జరగకూడదు. స్త్రీలు పురుషులకు బానిసలన్న భావం తొలగిపోవాలి.

- గోపాల్ గణేష్ ఆగర్‌కర్, సంఘ సంస్కర్త.

ఎన్నికల ఫలితాలు - స్పష్టమైన సంకేతాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను దేశ ప్రజలూ పార్టీలూ మీడియా ఇంకా మాట్లాడుకుంటుండగానే ప్రధాని మోడీ కేంద్రంలో హ్యాట్రిక్ నినాదం మీడియాలో తీసుకురావడం యాదృచ్ఛికమేమీ కాదు. తెలంగాణను మినహాయించితే మూడు కీలక హిందీ రాష్ట్రాల గెలుపుతో మరోసారి తన సంఖ్య పెంచుకున్న కాషాయ పార్టీ నుంచి ఈ దూకుడు ఊహించిందే. బిజెపి రాజకీయ వ్యూహాలు, ప్రతిపక్షాలను ఉక్కిరి బిక్కిరి చేసి ప్రజల ముందు తనే బాహుబలిగా ప్రత్యక్షం కావాలనే మోడీ రాజకీయం గత పదిపదిహేనేళ్లుగా దేశం చూస్తూనే వుంది. అన్ని విధాల వంత పాడే బడా మీడియా, అధికార రాజకీయాలలో మునిగితేలుతూ బిజెపి హైపర్ హిందూత్వ దాడి నుంచి దృష్టి మరల్చే జాతీయ ప్రాంతీయ లౌకిక పార్టీల పోకడలూ ఇందుకు తోడవుతుంటాయి. గెలుపు ముందు ఓటమి ఎప్పుడూ వెలవెలబోతుందన్నట్టు విజయం విశ్వరూపంలో కనిపిస్తుంటే పరాజితులను పరాభవించడం పరిపాటి. బహుశా ఈ సన్నివేశంలో ఈ లక్షణం మరింతగా ఆవిష్కృతమవుతున్నది. పార్లమెంటు సమావేశాల ప్రారంభ ఘట్టంలో మోడీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని ప్రతిపక్షాలు ప్రతికూల వైఖరి అనుసరించతగదని, మరోసారి గెలిచే అవకాశాలు ఎప్పుడూ వుంటాయని మనస్తత్వ పాఠాలు ప్రవచించారు. ప్రతిపక్షాల సవాళ్ల నుంచి ఎప్పుడూ పలాయనం చిత్తగిస్తూ దేశం ముందుకొచ్చిన సవాళ్లకు సమాధానమివ్వకుండా ఏకపక్ష ఆధిక్యతతో పార్లమెంటు పని తీరును ప్రహసనంగా మార్చిన ఘనత నిజానికి ఆయనదే. ఇప్పుడు ఇది మరింత ముదురుతుందని తాజా సంకేతాలు చెబుతూనే వున్నాయి. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత తొలి సమావేశాలలోనే ఆర్టికల్ 370 రద్దు బిల్లు ఆమోదింపచేసు కున్న ఈ ప్రభుత్వం ఈ ముగింపు దశలో అక్కడ రిజర్వేషన్లనీ ఆక్రమిత కాశ్మీర్‌కూ సీట్లు అట్టిపెట్టడం, విముక్తి చేయడమనీ కొత్త నినాదం తీసుకొస్తున్నది. ఇవన్నీ వచ్చే ఎన్నికలకు సన్నాహాలే. అయోధ్యలో ఆలయ ప్రతిష్టాపన, నెహ్రూ తప్పిదా లంటూ దాడి, చరిత్ర పుస్తకాలను మరింత తలకిందులు చేయడం ఇవన్నీ దాని కొనసాగింపే. రాబోయే కాలానికి సంబంధించిన రాజకీయ హెచ్చరికలే ఇవి. ఇదే శీర్షికలో 'ఇండియా' వేదిక, కాంగ్రెస్ పోకడలు పేరిట (నవంబర్ 5న) ప్రచురితమైన వ్యాసం ఒకసారి గుర్తు చేసుకుంటూ ఈ పరిస్థితికి కారణాలు కనిపిస్తాయి. వివిధ ప్రాంతీయ లౌకిక పార్టీలకూ ఆ వ్యాఖ్యలు వర్తిస్తాయి. మోడీత్వ విజృంభించే తరుణంలో ప్రజల తీర్పు పాఠాలను వంటపట్టించుకోవడమే ఇప్పుడు తక్షణ కర్తవ్యం. 119 స్థానాలు గల శాసనసభలో 65 (సిపిఐ1) సీట్లు గెలిచి తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణ స్వీకారానికి నాయకత్వమంతా తరలి రావడం మినహా ఫలితాలపై బిజెపి దూకుడు ఇలా వుంటే కాంగ్రెస్ ఇంతవరకూ సమగ్రమైన వ్యాఖ్యలు కూడా చేయలేదు.

బిఆర్‌ఎస్‌కు గుణపాఠం, రేవంత్‌కు సారథ్యం

తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందనేది ముందుగా అత్యధిక సర్వేలు, వాటికి తారాస్థాయిగా ఎగ్జిట్ పోల్స్ ముందే ఊహించాయి. వాటిని ఏ మేరకు విశ్వసించవచ్చుననేది కూడా ఇక్కడ చర్చించాము. తెలంగాణలో కాస్త అటూఇటూగా నిజమైన ఈ పోల్స్ ఎం.పి, రాజస్థాన్‌లలో విఫలమైనాయి. తెలంగాణపై ఖచ్చితంగా చెప్పిన 'ఇండియా టుడే' కూడా అక్కడ దెబ్బతిన్నది. ఆ సంగతి అలా వుంచితే తెలంగాణలో కెసిఆర్ ఏకపక్ష పోకడల పట్ల, ప్రభుత్వ తప్పుల పట్ల ఓటర్ల ఆగ్రహం తీవ్రంగానే వుందని ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఆఖరుకు ఆయన, రేవంత్‌రెడ్డి కూడా ఒక స్థానంలో ఓడిపోయారు. తెలంగాణ సాధించిన నేతగా కెసిఆర్ వీటన్నిటినీ అధిగమిస్తారనే బిఆర్‌ఎస్ ఆశలు ఆచరణలో కుప్పకూలాయి. సెంటిమెంటు, సంక్షేమ పథకాల ప్రభావం పల్లెల్లో అధికంగా వుంటుందనే అంచనాలు కూడా తలకిందులైనాయి. ఎందుకంటే హైదరాబాద్, రంగారెడ్డిలో కాంగ్రెస్ సీట్లు తెచ్చుకోలేక పోయింది. ఉత్తర తెలంగాణలో అధికంగానూ, దక్షిణ భాగంలో పూర్తిగానూ దాని విజయాలు లభించాయి. ఉత్తర భాగంలో బిజెపి కూడా మంచి ఫలితాలే సాధించింది. వాస్తవానికి బిజెపితో బిఆర్‌ఎస్ రాజీ పడటం, ఉభయులూ కలసి కాంగ్రెస్‌ను రాకుండా చేయడం కోసం వారి మధ్య తెర వెనక దోస్తీ వుందనే బలమైన అభిప్రాయం తీర్పును చాలావరకూ ప్రభావితం చేసింది. మునుగోడులో వామపక్షాల మద్దతుతో బిజెపిని ఓడించిన తర్వాత తెలంగాణ రాజకీయ దృశ్యం మారింది, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ మోడీపై తీవ్ర విమర్శలే కురిపించారు. టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా మార్చి జాతీయ పాత్ర నిర్వహిస్తామన్నారు. అయితే అదే సమయంలో కాంగ్రెస్, బిజెపిల మధ్య సమ దూరం సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. మహారాష్ట్రలో రాజకీయ హడావుడి చేశారు (గత ఎన్నికల తరుణంలోనూ 'దేశ్ కీ నేతా' నినాదంతోనే ఓటర్ల ముందుకు వెళ్లారని గుర్తుంచుకోవాలి.). కానీ ఇవన్నీ ఒక్కసారిగా ఆపేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితపై దర్యాప్తు, నోటీసుల తర్వాత కెసిఆర్ వెనక్కు తగ్గారనే భావం బలంగా వ్యాపించింది. కమ్యూనిస్టులతో పొత్తు వుంటుందనే సూచనను మొదట ఇచ్చిన ఆయన తర్వాత తనే వాటిని ఏకపక్షంగా వమ్ముచేయడానికి కూడా ఇదే కారణమైందని అభిప్రాయమేర్పడింది. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కూడా బిజెపి మత రాజకీయాలు, కేంద్రీకృత పెత్తనంపై పోరాటం కంటే రాష్ట్రాధిపత్యం కోసం తమలో తమ పోటీనే ముందుకు తెచ్చారు. బిజెపి ఇక్కడ శక్తి కాదనే వాదన చేశారు. అవతలి వారే బిజెపితో కలిసిపోయారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఎబివిపి నేపథ్యం గురించి బిఆర్‌ఎస్ చెప్పింది. కవితను అరెస్టు చేయకపోవడం, మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుపై కేంద్ర దర్యాప్తు జరిపించకపోవడం, సిబిఐ దాడులు లేకపోవడం కుమ్మక్కు వల్లనేనని కాంగ్రెస్ కేంద్ర రాష్ట్ర నాయకులు విమర్శలు గుప్పించారు. మరోవైపు కాంగ్రెస్ మిగిలినచోట్ల వలెనే వామపక్షాల విషయంలో అవాస్తవిక వైఖరి అనుసరించింది. ఇవన్నీ ఫలితాలలో ప్రతిబింబించాయి. సిపిఐ ఒక్క స్థానంతో సర్దుబాటు చేసుకుని విజయం సాధించింది (గత రెండు ఎన్నికల్లో కూడా సిపిఐ కాంగ్రెస్ కలిసే పోటీ చేశాయి). ఆహ్వానం వస్తే మంత్రివర్గంలో చేరే విషయం పరిశీలిస్తామని సానుకూల సూచనలు ఇచ్చింది కానీ ఇప్పటికైతే ఆ దిశలో అడుగులు పడలేదు. సిపిఎం స్వంతంగా పోటీ చేసింది. సిపిఐకి మద్దతునిచ్చింది. అది ఎక్కడా విజయం సాధించకపోవడం, ఓట్లు బాగా తక్కువగా రావడం ఉద్యమాభిమానులకు నిరుత్సాహం కలిగించింది. వీటిపై సమీక్ష చేసుకుంటామని, ఎప్పటిలాగానే ప్రజల కోసం పోరాడతామనీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. కొత్త ప్రభుత్వాన్ని స్వాగతిస్తూనే ప్రజల తీర్పును సరిగ్గా అర్థం చేసుకుని సరైన పాలన అందించాలని సూచించారు. ఈ సందర్భంలో రాజకీయ నేపథ్యాన్ని వందల కోట్లతో నడిచిన ఎన్నికల రాజకీయాన్ని విస్మరించి కమ్యూనిస్టులను చులకన చేస్తూ మాట్లాడటం దారి తప్పిస్తుంది, బిజెపి కూడా 13.9 శాతం ఓట్లు, 8 సీట్లు పొంది ఒక శక్తిగా వచ్చింది. నిజానికి 2019 పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఇది కొంచెం తక్కువ కాగా గత అసెంబ్లీ ఎన్నికల కంటే బాగా ఎక్కువ. ఈ దఫా కాంగ్రెస్ బిఆర్‌ఎస్ ల మధ్య ఓట్ల తేడా రెండు శాతం లోపు వచ్చింది. మజ్లిస్ తన 7 స్థానాలు నిలబెట్టుకుంది. ఇరు పక్షాల మధ్య తేడా తొమ్మిదే గనక ఆరు నెలల్లో అంతా మారిపోతుందనే ప్రచారం వివిధ రూపాల్లో సాగుతూనే వుంది. విజయానికి నాయకత్వం వహించిన రేవంత్‌రెడ్డి సహజంగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా అంతర్గత ఐక్యత, శాసనసభలో సవాళ్లు తీవ్రంగానే వుంటాయనడం నిస్సందేహం. మూడు మాసాల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాతనే రాజకీయ పరిస్థితి ఒక కొలిక్కి వస్తుందని విస్తృత చర్చ జరుగుతున్నది. ఫిరాయింపులతో కెసిఆర్ బలం విపరీతంగా పెంచుకున్న గత పద్ధతులు పునరావృతం కాబోవని, కాంగ్రెస్ నాయకులు బాధ్యతగా వ్యవహరించి ప్రజల తీర్పును సార్థకం చేసుకుంటారని ఆశించాలి. అయితే కొంతమంది ఈ కారణంగా చులకన చేస్తూ మాట్లాడటం, రేవంత్ ప్రభుత్వం ఆరు నెలల్లో పడిపోతుందని బిజెపి ఎంఎల్ఎ రాజాసింగ్ బెదిరించడం మాత్రం దారుణం, అప్రజాస్వామికం. తీర్పును స్వాగతిస్తామని బిఆర్‌ఎస్ చెబుతున్నా అటూ ఇటూ అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. రేవంత్ విజయం వెనక తెలుగుదేశం ప్రధానంగా వుందని ఒక ప్రచారం జరిగినా తమకేమీ సంబంధం లేదని ప్రకటించింది. టిడిపి మిత్రపక్షం, ఎన్‌డిఎ భాగస్వామి జనసేన బిజెపితో కలిసి ఎనిమిది చోట్ల పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయింది. అక్కడ టిడిపి ఇక్కడ బిజెపి అనే ప్రశ్న ఒకటి రాగా టిడిపి వరకూ కాంగ్రెస్‌తో తాము లేమన్న సందేశం బిజెపికి చేర్చడానికి జాగ్రత్త పడుతున్నది. ఈ ఎన్నికల ఫలితాలపై రాజకీయ పరిణామాలపై మరింత వివరమైన చర్చ ముందు ముందు తప్పక జరపాల్సి వుంటుంది.

> **పార్లమెంటు సమావేశాల ప్రారంభ ఘట్టంలో మోడీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని ప్రతిపక్షాలు ప్రతికూల వైఖరి అనుసరించతగదని, మరోసారి గెలిచే అవకాశాలు ఎప్పుడూ వుంటాయని మనస్తత్వ పాఠాలు ప్రవచించారు. ప్రతిపక్షాల సవాళ్ల నుంచి ఎప్పుడూ పలాయనం చిత్తగిస్తూ దేశం ముందుకొచ్చిన సవాళ్లకు సమాధానం ఇవ్వకుండా ఏకపక్ష ఆధిక్యతతో పార్లమెంటు పని తీరును ప్రహసనంగా మార్చిన ఘనత నిజానికి ఆయనదే. ఇప్పుడు ఇది మరింత ముదురుతుందని తాజా సంకేతాలు చెబుతూనే వున్నాయి.**

కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బ

ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలోనూ కొత్త ప్రాంతీయ పార్టీ జెడ్‌పిఎం అధికారం చేపట్టింది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి లాల్ దుహోమా ఏ కూటమిలోనూ చేరే యోచనలో లేరు. ఇక రాజస్థాన్ చేజారుతుందనుకున్నా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అంచనాలు తలకిందులైనాయి. బిజెపియే ఊహించినదానికన్నా ఎక్కువ విజయం సాధించింది. ఇందుకు దారితీసిన రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల గురించి 'పీపుల్స్ డెమొక్రసీ' తాజా సంపాదకీయం సమగ్రంగానే విశ్లేషించింది, హెచ్చరిస్తున్నది కూడా. అయితే ఛత్తీస్‌గఢ్, ఎం.పి లలో తమ వాళ్ల మధ్య తగాదాల గురించి, నాయకుల తేడాల గురించి మాత్రమే కాంగ్రెస్ చర్చ ఎక్కువగా నడుస్తున్నది. రాజస్థాన్‌లో ఓటమి రావచ్చని భావించినా తీవ్రత చాలా ఎక్కువగా వుంది. 17 మంది మంత్రులు ఓడిపోయారు. మధ్యప్రదేశ్‌లో ఫిరాయింపులతో తిరిగొచ్చిన బిజెపి ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ హిందూత్వ రాజకీయాలనూ కొన్ని పథకాలను ఆధారం చేసుకుని గెలుపొందారు. కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కూడా బిజెపి నమూనాను అనుకరించబోయి రెండు విధాల భంగపడ్డారు. ఛత్తీస్‌గఢ్ మాత్రం గెలుస్తామనుకుని దారుణ ఓటమి పాలైంది కాంగ్రెస్. ఈ రెండు రాష్ట్రాలలోనూ ఆదివాసీ ప్రాంతాలలో ఎస్‌టి సీట్లలో బిజెపి చాలా పట్టు సాధించడం ప్రత్యేకించి ఆందోళనకరం. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్, బిజెపిల మధ్య 1997, 2003, 2018 ఎన్నికలలో శాసనసభ, లోక్‌సభ ఫలితాలు తారుమారైనాయి. ఇప్పుడు ఓట్ల సంఖ్య కూడా బిజెపి కూటమి కన్నా 'ఇండియా'లో భాగస్వాములైన వారికే ఎక్కువ అని లెక్కలు చెబుతున్నారు. 12.29 కోట్ల ఓట్లు పోలవగా బిజెపి కూటమికి 4.82 కోట్ల ఓట్లు, కాంగ్రెస్‌కు 4.92 కోట్ల ఓట్లు, 'ఇండియా'లో భాగస్వాములైన వాటికి మొత్తంగా 5.06 కోట్ల ఓట్లు వచ్చాయి. వీటి ఆధారంగా నిపుణులు ఏవో లెక్కలు కడుతున్నారు గానీ నిజంగా జరగాల్సింది కాంగ్రెస్ ధోరణిలో మార్పు. 'ఇండియా' వేదికను సక్రమంగా నిర్వహించడం. రాజకీయంగా సైద్ధాంతికంగానే గాక ఓట్ల చీలిక నివారించేందుకు కృషి చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల పోరాటం సరైన ఫలితాలిస్తుంది. ★

> **ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్, బిజెపిల మధ్య 1997, 2003, 2018 ఎన్నికలలో శాసనసభ, లోక్‌సభ ఫలితాలు తారుమారైనాయి. ఇప్పుడు ఓట్ల సంఖ్య కూడా బిజెపి కూటమి కన్నా 'ఇండియా'లో భాగస్వాములైన వారికే ఎక్కువ అని లెక్కలు చెబుతున్నారు. 12.29 కోట్ల ఓట్లు పోలవగా బిజెపి కూటమికి 4.82 కోట్ల ఓట్లు, కాంగ్రెస్‌కు 4.92 కోట్ల ఓట్లు, 'ఇండియా'లో భాగస్వాములైన వాటికి మొత్తంగా 5.06 కోట్ల ఓట్లు వచ్చాయి. వీటి ఆధారంగా నిపుణులు ఏవో లెక్కలు కడుతున్నారు గానీ నిజంగా జరగాల్సింది కాంగ్రెస్ ధోరణిలో మార్పు, 'ఇండియా' వేదికను సక్రమంగా నిర్వహించడం. రాజకీయంగా సైద్ధాంతికంగానే గాక ఓట్ల చీలిక నివారించేందుకు కృషి చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల పోరాటం సరైన ఫలితాలిస్తుంది.**

సామాజిక భద్రత కల్పించని పాలకులు

సమస్య

పి. అజయ కుమార్

వ్యవసాయ కార్మికులు, రైతులు, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు...ఆదాయాలు, వేతనాల సమస్యను ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో పనులు, ఉద్యోగాలు చేయలేని సమయంలో వీరిని ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరిస్తున్నాయి. పైగా అది తమ పని కాదని, వారి కుటుంబాలే చూసుకోవాలని వాదిస్తున్నాయి.

సామాజిక పెన్షన్లు

వృద్ధులకు ఇచ్చే సామాజిక పెన్షన్లు ఉచితంగా ఇచ్చేవి కావు. 30, 40 సంవత్సరాలు సమాజానికి సేవ చేసినందుకు ప్రభుత్వం బాధ్యతగా ఇచ్చేవి. వాటికి కానుకలుగా పేరుపెట్టడం సమంజసం కాదు. వై.ఎస్.ఆర్, ఎన్.టి.ఆర్, ఇందిరమ్మ పేర్లతో వాటిని పిలవడం పెన్షనర్లను తమ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవటానికే. వారిని ఆ విధంగా చిన్న చూపు చూడడం ప్రభుత్వాల బాధ్యాతారాహిత్యం. నెలకు రూ.2750 పెన్షన్‌గా ఇచ్చి చేతులు దులుపుకునే చర్యను కూడా రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. ఇవి ఎవరి జేబులో నుండి సొంతగా ఇచ్చేవి కావు. ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులలో భాగంగా వచ్చేవి. పెన్షన్ పొందటాన్ని పెన్షనర్ల ప్రాథమిక హక్కుగా ఉన్నత న్యాయస్థానం గుర్తించింది. రాజ్యాంగం ప్రకారం కూడా జీవించే హక్కులో భాగంగా పెన్షన్ హక్కు ఉంటుంది.

అందరితో ఉంటాం, అందరి శ్రేయస్సు కోసం పని చేస్తామని చెప్పుకునే మోడీ ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్లకు కేవలం నెలకు రూ.200 మాత్రమే ఇస్తోంది. 80 సంవత్సరాలు, ఆపైన వయస్సు ఉన్నవారికి మాత్రమే రూ.500 చొప్పున కేటాయిస్తోంది. మిగతా భారం అంతా రాష్ట్ర ప్రభుత్వాలపై నెడుతోంది. సామాజిక పెన్షన్లను కనీసం రూ.10,000 చేయాలని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మోడీ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

సామాజిక పెన్షన్లను కనీసంగా రూ.10,000కు పెంచటానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం... అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంపన్నులపై పన్నులు వేసి సేకరించాలి. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విధానం అమలు చేసే విధంగా ఇప్పటి నుండే ఒత్తిడి చేయాలి. సామాజిక పెన్షన్లను కేవలం దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారికి మాత్రమే పరిమితి చెయ్యడం సరికాదు.



బిపిఎల్ అయినా, ఎపిఎల్ అయినా దానితో సంబంధం లేకుండా శ్రామికులందరికీ వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వాలి. ఆదాయ పరిమితి పేరుతో కుటుంబంలో సభ్యులుగా ఉండి ఇతర వృత్తులు చేసుకున్నవారికి ఇవ్వకపోవడం సరికాదు.

> **సామాజిక పెన్షన్లను కనీసంగా రూ.10,000కు పెంచటానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం... అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంపన్నులపై పన్నులు వేసి సేకరించాలి. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విధానం అమలు చేసే విధంగా ఇప్పటి నుండే ఒత్తిడి చేయాలి. సామాజిక పెన్షన్లను కేవలం దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారికి మాత్రమే పరిమితి చెయ్యడం సరికాదు. బిపిఎల్ అయినా, ఎపిఎల్ అయినా దానితో సంబంధం లేకుండా శ్రామికులందరికీ వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వాలి. ఆదాయ పరిమితి పేరుతో కుటుంబంలో సభ్యులుగా ఉండి ఇతర వృత్తులు చేసుకున్నవారికి ఇవ్వకపోవడం సరికాదు.**

ఇపిఎస్ పెన్షన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార రంగం, ప్రైవేటు సంస్థలలో పని చేస్తూ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ చందాదారులుగా వున్న ప్రతి ఒక్కరికీ పని నుండి దిగిపోయిన తరువాత వృద్ధాప్యంలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం కింద పెన్షన్లు వస్తాయి. ఈ స్కీం కింద ఉండే పెన్షన్ నియమాల ప్రకారం చాలా తక్కువ పెన్షన్ వస్తుంది. పెరిగిన ధరలకు నష్టపరిహారం (కరువు భత్యం) కూడా ఉండదు. జీతం పెద్ద స్థాయిలో వున్న వారికి కూడా పెన్షన్ చాలా తక్కువగా వస్తుంది.

కనీస పెన్షన్‌ను నెలకు 9 వేల రూపాయలకు పెంచాలని ఇపిఎస్ పెన్షనర్ల సంఘాలు అడుగుతున్నా మోడీ ప్రభుత్వం కదలడం లేదు. ప్రస్తుతం కనీస పెన్షన్ కేవలం వెయ్యి రూపాయలు. దీన్ని రెండు వేలకు పెంచుతారా? అని పార్లమెంట్ సభ్యులు అడిగితే మోడీ ప్రభుత్వం తన దగ్గర అంత డబ్బు లేదని, పెంచలేనని చెప్పింది. అదే సమయంలో ప్రతి సంవత్సరం కార్పొరేట్ కంపెనీల ఆదాయ పన్నులలో 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా రాయితీలు ఇస్తోంది.

వాస్తవంగా కేంద్ర ప్రభుత్వానికి పైసా ఖర్చు గాకుండానే ఇపిఎస్ పెన్షనర్ల పెన్షన్‌ను గణనీయంగా పెంచే అవకాశం ఉంది. కార్మికులకు చెందిన పి.ఎఫ్ డబ్బులలో కొంత భాగాన్ని పెన్షన్ ఫండ్‌కు తరలిస్తారు. 2023 మార్చి 31 నాటికి ఈ పెన్షన్ ఫండ్ నిల్వ రూ.7 లక్షల 80 వేల కోట్లు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫండ్‌కు రూ. 1 లక్ష 17 వేల కోట్లు జమయ్యాయి. దీనిలో వడ్డీ రూపేణా వచ్చిన జమ ఒక్కటే రూ. 52 వేల కోట్లు. కానీ ఈ సంవత్సరంలో 75 లక్షల మంది పెన్షనర్లకు చెల్లించిన పెన్షన్ మొత్తం రూ.14 వేల కోట్లు మాత్రమే. అంటే సరాసరిన ఒక్కొక్కరికి నెలకు రూ. 1592 మాత్రమే చెల్లించారు. ఇది సామాజిక పెన్షన్ల కంటే కూడా చాలా తక్కువ.

పరిమితికి మించి వాస్తవ వేతనం మీద పి.ఎఫ్ కట్టిన చందాదారులకు పి.ఎఫ్ నిబంధనల ప్రకారం అధిక పెన్షన్ ఇవ్వాలి. కాని కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో దీన్ని చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయినప్పటికి మోడీ ప్రభుత్వం దాన్ని అమలు చెయ్యకుండా తాత్సారం చేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు కూడా కొందరికి చేదుగా, కొందరికి తీపిగా ఉండటం కూడా సహజ న్యాయానికి విరుద్ధం. ఈ తీర్పు ప్రకారం 2014కు ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కార్మికులకు అధిక పెన్షన్ వర్తించదు. 2014 సెప్టెంబర్ 1 నాటికి సర్వీసులో కొనసాగుతున్న వారికి మాత్రమే సుప్రీం కోర్టు తీర్పు వర్తిస్తుంది. అత్యున్నత న్యాయస్థానం కూడా పాలక ప్రభుత్వాల ఒత్తిడికి లోనుకావడం పెన్షనర్లకు నష్టం చేసింది.

దాదాపు రూ. 8 లక్షల కోట్లు పెన్షన్ ఫండ్ నిల్వలు ఉన్నప్పటికీ పెన్షన్లు పెంచడానికి మోడీ ప్రభుత్వం ఎందుకు సిద్ధం కావడంలేదు? దానిలో సగం నిల్వను ఉపయోగించి పెన్షనర్లు కోరుతున్న విధంగా కనీస పెన్షన్ రూ. 9 లేదా 10 వేలు చెల్లించే అవకాశం ఉన్నా కూడా మోడీ ప్రభుత్వం ఎందుకు నిరాకరిస్తోంది?

మోడీ ప్రభుత్వం ఇపిఎస్ పెన్షన్ స్కీంను మార్చాలనే ఆలోచనలో ఉంది. పెన్షన్ ఫండ్ మొత్తాన్ని విదేశీ పెట్టుబడుల సేవకు మరియు అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థల వాటాల విలువలను పెంచేందుకు ఉపయోగించాలని చూస్తోంది. మోడీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లలో సామాజిక భద్రతా కోడ్ ఒకటి. 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ఈ కోడ్ అమలు లోకి వస్తుంది. దీని ప్రకారం పెన్షన్ స్కీంలో మోడీ ప్రభుత్వం మార్పులు చేస్తుంది. పార్లమెంట్ ఆమోదం కూడా అవసరం లేదు. కార్మికుల నిధి రూ.8 లక్షల కోట్లు జూదపూరిత షేర్ మార్కెట్‌కు తరలిపోతాయి. కార్మికులకే చెందిన ఈ నిధి మొత్తం కార్మికులకే ఉపయోగపడాలంటే మోడీ తిరిగి అధికారంలోకి రాకుండా చూడాలి. కొత్త ప్రభుత్వం ఏదైనా సరే కార్మికులకే ఈ నిధిని ఉపయోగపెట్టేలా ఆందోళనలు చెయ్యాలి. దీనికి ఎన్నికలే మంచి సమయం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలో పని చేసే పర్మినెంట్ ఉద్యోగులు, అందులో 2004కు ముందు సర్వీసులో చేరిన వారికి మాత్రమే మెరుగైన పాత పద్ధతిలో పెన్షన్ వస్తుంది. 2004 జనవరి, సెప్టెంబర్ నెలలు మరియు ఆ తరువాత చేరిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, టీచర్లకు పెన్షన్లు తీసివేశారు. 2010 ఏప్రిల్ 1 మరియు ఆ తరువాత చేరిన బ్యాంకు, ఇన్సూరెన్స్ ఉద్యోగులకు కూడా పెన్షన్లు లేవు. కార్పొరేషన్లుగా మారిన తరువాత చేరిన బిఎస్ఎన్ఎల్, విద్యుత్ కార్పొరేషన్ల ఉద్యోగులకు పెన్షన్లు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి ఖాతాలలో చెల్లించిన జమల నుండి పదవీ విరమణ తరువాత నూటికి రూ.40 ఎటువంటి గ్యారంటీ లేని మార్కెట్లలో పెట్టుబడి పెట్టాలి. వాటికి ఏమైనా ఆదాయం అంటూ వస్తే దాన్నే పెన్షన్ కింద లెక్కేసుకొని సరిపెట్టుకోవాలి. బ్యాంకు, బీమా ఉద్యోగులకు కూడా అదే పరిస్థితి. బిఎస్ఎన్ఎల్, విద్యుత్ కార్పొరేషన్లలో చేరిన ఉద్యోగులకు అతి తక్కువగా ఉండే ఇపిఎస్ పెన్షన్లు మాత్రమే గతి.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరిస్తామనే వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన వైసిపి తన వాగ్దానానికి తిలోదకాలు ఇచ్చింది. గ్యారంటీ పెన్షన్ స్కీంను కొత్తగా తెచ్చింది. ఈ స్కీంను ఎంపిక చేసుకున్నవారు తమ ఖాతాలలో జమ అయ్యే నూటికి నూరు రూపాయలను మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలి. ఇంటికి తీసుకుపోయేదేమీ ఉండదు. ఎటువంటి గ్యారంటీ లేని మార్కెట్ ఆదాయం ఏమైనా తను చెప్పిన దానికంటే తక్కువ పడితే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇది కూడా గ్యారంటీ ఉండదు. ఎప్పుడైనా సరే తాను చెల్లించే భాగాన్ని ఉపసంహరించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. గ్యారంటీ పెన్షన్ స్కీంలో గ్యారంటీని లేకుండా చేసింది.

అంతా ఐక్యం కావాలి

శ్రామికులందరికి పెన్షన్లు లేకుండా చేసి అన్ని తరగతులనూ ఐక్యం చేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదే! సామాజిక, ఇపిఎస్, సిపిఎస్, జిపిఎస్ పెన్షనర్లంతా ఐక్యం కావాలి. పెద్ద ఎత్తున పోరాటాలు చేసి తమకు వ్యతిరేకమైన పాలకుల విధానాలను తిప్పి కొట్టి వృద్ధాప్యంలో ఉన్న శ్రామికుల కుటుంబాలకు పూర్తి రక్షణ కల్పించే విధానాలను అమలు చేయించుకోవాలి. ఏ ప్రభుత్వం వచ్చినా సరే తాము సృష్టించిన సంపదలో తమ వాటాను దక్కించుకునేలా పెన్షనర్లు భారీ పోరాటాలతో పాలకులపై ఒత్తిడి తేవాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

★

గౌరీ లంకేష్ హత్య కేసులో నిందితుడికి బెయిల్

బెంగళూరు : జర్నలిస్ట్ గౌరీ లంకేష్, రచయిత ఎంఎం కల్‌బుర్గీ హత్య కేసులను త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో ఓ నిందితుడికి కర్నాటక హైకోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. పాత్రికేయురాలు గౌరీ లంకేష్ హత్య కేసులో 11వ నిందితుడైన మోహన్ నాయక్‌కు హైకోర్టు శుక్రవారం బెయిల్ ఇచ్చింది. గౌరీ లంకేష్ తన నివాసంలో ఉండగా 2017 సెప్టెంబర్ ఐదున కొందరు దుండగులు కాల్చి చంపారు. ఈ కేసులో 18 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినప్పటికీ విచారణలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. నాయక్‌కు బెయిల్ మంజూరు కావడానికి ఇది ఓ కారణం. నిందితుడు 2018 జులై 18 నుండి కస్టడీలోనే ఉన్నాడు.

'ఈ కేసులోని 527 మంది ఛార్జిషీటు సాక్షులలో కేవలం 90 మందిని మాత్రమే విచారించారు. విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టును మేము 2019 ఫిబ్రవరి 11న ఆదేశించాం. 2021 అక్టోబర్‌లో అభియోగాలు మోపినప్పటికీ ఇంకా 400 మందికి పైగా సాక్షులను విచారించాల్సి ఉంది. గడచిన రెండు సంవత్సరాల కాలంలో కేవలం 90 మందిని మాత్రమే విచారించారు. దీనిని బట్టి చూస్తే విచారణ ఇప్పట్లో పూర్తయ్యేలా లేదు' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ఐదు సంవత్సరాలకు పైగా కస్టడీలో ఉన్నాడని గుర్తు చేసింది. కాగా తన ప్రమేయానికి సంబంధించి 23 మంది సాక్షులను విచారించాల్సి ఉండగా కేవలం ఒక్కరిని మాత్రమే విచారించారని నాయక్ కోర్టు దృష్టికి తెచ్చారు. నాయక్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం లక్ష రూపాయల వ్యక్తిగత బాండ్, అంతే మొత్తానికి రెండు పూచీకత్తులు సమర్పించాలన్న షరతుతో బెయిల్ మంజూరు చేసింది.

బిఎస్‌పి నుంచి ఎంపి డానిష్ అలీ సస్పెన్షన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ సభ్యులు డానిష్ అలీని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం ఆ పార్టీ తెలిపింది. 'పార్టీ విధానాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణకు వ్యతిరేకంగా చేసిన ప్రకటనలు, వ్యాఖ్యలు, చర్యలపై కొన్ని సార్లు హెచ్చరించాం. అయినప్పటికీ, నిరంతరం పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు' అని బిఎస్‌పి తన ప్రకటనలో పేర్కొంది. చంద్రయాన్ 3 మిషన్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా బిజెపి సభ్యుడు రమేష్ బిధురి తనపై చేసిన వ్యాఖ్యలపై చర్య తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అలీ ఆశ్రయించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాను 'క్యాష్ ఫర్ క్వెరీ' ఆరోపణలపై విచారణ సందర్భంలో ఎథిక్స్ కమిటీ సభ్యునిగా అలీ ఆమెకి మద్దతు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బిఎస్‌పి ఆయనను సస్పెండ్ చేయడం గమనార్హం.

బిజెపిపై గళమెత్తినందునే..

బిజెపికి వ్యతిరేకంగా గళమెత్తినందునే తనను పార్టీ నుంచి తొలగించడం దురదృష్టకరమని అలీ అన్నారు. పార్టీ తనను సస్పెండ్ చేయడంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ 'బిజెపికి వ్యతిరేకంగా స్వరం వినిపించడం నేరమయితే..నేను చేసింది నేరమే. సిద్ధాంతాలపై రాజీ పడే వ్యక్తిని కాదు. పోరాటం ఆపే ప్రసక్తే లేదు' అని ఆయన పేర్కొన్నారు.

సోనియాకు మోడీ, స్టాలిన్ ప్రభృతుల శుభాకాంక్షలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్ర నాయకులు, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ 77వ పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రభృతులు శుభాకాంక్షలు తెలిపారు. సోనియా గాంధీ కూడా చిరకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు మోడీ ట్వీట్ చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకులు కెసి వేణుగోపాల్, శశిథరూర్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అణగారిన ప్రజల హక్కుల కోసం సోనియా గాంధీ పోరాటం చేస్తున్నారని ఖర్గే పేర్కొన్నారు. సోనియా జీవన ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని వేణుగోపాల్ కొనియాడారు. కాగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఆ విజయాన్ని సోనియాకు పుట్టినరోజు కానుకగా అభివర్ణించిన స్థానిక నేతలు ఆమె జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావుతో 78 కిలోల కేక్ కట్ చేయించి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క మల్లు, ఇతర మంత్రులు, నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌డిఎలో చేరుతాం : పిసి జార్జ్

తిరువనంతపురం : లోక్‌సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ)లో చేరతామని కేరళ జనపక్షం (సెక్యులర్) – కెజె(ఎస్) నేత పిసి జార్జ్ తెలిపారు. శనివారం జరిగిన కెజె (ఎస్) రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. పథనంథిట్ట లేదా కొట్టాయం నుంచి ఎన్‌డిఎ అభ్యర్థిగా జార్జ్‌ను బరిలో నిలిపే వీలుందని కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. అయితే దీనిపై ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి చర్చలూ జరపలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కె సురేంద్రన్ తెలిపారు.

మైనారిటీ విద్యార్థుల పట్ల వివక్ష

- మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ ఎత్తివేసేందుకు కేంద్రం కుయుక్తులు
- ఎంఎఎన్ఎఫ్‌ని పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మైనార్టీలకు చెందిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూతనందించడానికి ఉద్దేశించిన మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఎఎన్ఎఫ్)ను క్రమంగా ఎత్తివేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల కుయుక్తులు పన్నుతోంది. దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎంఎఎన్ఎఫ్ పొందుతున్న వారికిచ్చే మొత్తాన్ని పెంచకుండా మైనార్టీ విద్యార్థుల పట్ల మోడీ సర్కార్ వివక్షను కొనసాగిస్తోందని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) విమర్శించింది. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విపి సాను, మయూక్ బిశ్వాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రీసెర్చ్ ఫెలోషిప్‌లు షెడ్యూల్డ్ కులాల కోసం నేషనల్ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఎస్సి), షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోసం నేషనల్ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఎస్టి), ఇతర వెనుకబడిన తరగతుల కోసం నేషనల్ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఓబిసి), మైనారిటీ విద్యార్థులకు మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఎఎన్ఎఫ్)లకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఆర్ఎఫ్)లతో సమానంగా ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. 'జెఆర్ఎఫ్ కోసం రూ.31,000 నుండి రూ.37,000, ఎస్ఆర్ఎఫ్ కోసం రూ.35,000 నుండి రూ.42,000 రీసెర్చ్ ఫెలోషిప్‌లను ఈ సంవత్సరం పెంచడానికి యుజిసి ఆమోదించింది. ఈ ఆమోదం తరువాత ఎన్ఎఫ్ఎస్సి, ఎన్ఎఫ్ఎస్టి, ఎన్ఎఫ్ఓబిసి, ఫెలోషిప్ గ్రహీతలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలతో వారి సవరించిన ఫెలోషిప్ మొత్తాలను పొందారు. అయినప్పటికీ, ఎంఎఎన్ఎఫ్ ఫెలోషిప్ దారులకు మాత్రమే అందలేదు. ఫెలోషిప్ పెంపునకు సంబంధించి ఎటువంటి అప్ డేటు వారికి నేటి వరకు అందలేదు. దీనిపై ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మైనార్టీ విద్యార్థులకు అందజేసేందుకు ఉద్దేశించిన ఈ ఫెలోషిప్‌ను ఎత్తివేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుజిసి జెఆర్ఎఫ్, ఎన్ఎఫ్ఎస్సి, ఎన్ఎఫ్ఎస్టి, ఎన్ఎఫ్ఓబిసి, వంటి ఇతర ఫెలోషిప్‌లతో పోలిస్తే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఎఎన్ఎఫ్) పట్ల కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని, వివక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని, మిగిలిన ఫెలోషిప్‌తో సమానంగా ఎంఎఎన్ఎఫ్‌ను పెంచాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని విశ్వవిద్యాలయ విద్యార్థులకు పిలుపు ఇచ్చారు.

ఎంఎఎన్ఎఫ్‌ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

మహారాష్ట్ర, కర్ణాటకలో ఎన్ఐఎ విస్తృత సోదాలు

- 44 చోట్ల ప్రత్యేక ఆపరేషన్
- 15 మంది అరెస్ట్

పూణే/బెంగళూరు : మహారాష్ట్ర, కర్ణాటకలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శనివారం విస్తృత సోదాలు నిర్వహించింది. ఈ రెండు రాష్ట్రాల్లో 44 ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ సోదాల్లో 15 మందిని అరెస్టు చేసినట్లు ఎన్ఐఎ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) కుట్ర కేసుకు సంబంధించి ఈ సోదాలు నిర్వహించినట్లు పేర్కొంది. మహారాష్ట్రలోని పడ్గాబోరివలి, థానె, మీరా రోడ్, పూణేలోనూ కర్ణాటకలోని బెంగళూరులో ప్రాంతంలో శనివారం ఉదయం నుంచి ఎన్ఐఎ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి సోదాలు చేపట్టారు. ముంబయి పక్కనే ఉన్న థానె, పూణేతో పాటు మీరాభయాందర్‌లో ఎన్ఐఎ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో ఆకిఫ్ అతీఖ్ నాచన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. నాచన్ ఆగస్టులో పేలుడు పదార్థాల తయారీ కేసులో అరెస్టయ్యాడని ఎన్ఐఎ పేర్కొంది. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి టెర్రర్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు తెలిసిందని పేర్కొంది. దీంతో ఈ కేసుతో సంబంధమున్న వారందరినీ పట్టుకునేందుకు ఎన్ఐఏ అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన ప్రాంతాల్లో భారీ మొత్తంలో నగదు, పేలుడు పదార్థాలు, పదునైన ఆయుధాలు, కుట్రలకు సంబంధించిన పత్రాలు, ఫోన్లు, పలు ఇతర డిజిటల్ గాడ్జెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద భారత్‌లో ఇస్లామిక్ స్టేట్, దాని అనుబంధ సంఘాలపై నిషేదం ఉన్న సంగతి విదితమే.

ఆరునెలల్లో 7.7 శాతానికి జిడిపి

- ఇన్ఫినిటీ ఫోరం సదస్సులో మోడీ

న్యూఢిల్లీ : భారత జిడిపి వృద్ధిరేటు 7.7 శాతానికి చేరువయ్యే అవకాశముందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గుజరాత్‌లో గాంధీనగర్‌లో శనివారం నిర్వహించిన 'ఇన్ఫినిటీ ఫోరమ్ 2.0' సదస్సును ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించారు. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ (జిఐఎఫ్‌టి) సిటీలో ఈ సదస్సులో నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో జిడిపి వృద్ధి రేటు 7.7 శాతానికి చేరువయ్యే అవకాశం ఉందని మోడీ తెలిపారు. నేడు ప్రపంచం మొత్తం భారత్‌పైనే ఆశలు పెట్టుకుందని ఆయన చెప్పుకొచ్చారు. గత పది సంవత్సరాల్లో అమల్జేసిన సంస్కరణలకు ఇది ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ మార్కెట్‌లలో భారత్ ఒకటిగా ఉందని, దీనికి కేంద్రంగా జిఐఎఫ్‌టి ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సి) అభివృద్ధి చెందుతోందని తెలిపారు. జిఐఎఫ్‌టి సిటీని నవయుగ ఆర్థిక, సాంకేతిక సేవల ప్రపంచ నాడీ కేంద్రంగా మార్చాలని తమ ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన చెప్పారు. అలాగే గ్రీన్ క్రెడిట్స్ కోసం మార్కెట్ మెకానిజంను అభివృద్ధి చేయడంపై సలహాలు ఇవ్వాలని నిపుణులను కోరారు.

ఐఐటీలలో తగ్గిన నియామకాలు

- ఆర్థిక మందగమనమే కారణం

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఆర్థికాభివృద్ధి నత్తనడక నడుస్తోంది. ఈ వాతావరణం మన దేశంలోనూ కన్పిస్తోంది. ఫలితంగా ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు)లలో సైతం క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఐఐటీలలో తుది నియామకాల వారం ఈ నెల 1న ప్రారంభమైంది. గత సంవత్సరంతో పోలిస్తే నియామకాలు 15%-30% మధ్య తగ్గిపోయాయి. నియామకాల ప్రక్రియ ప్రారంభమై వారం రోజులు గడిచినప్పటికీ అనేకమంది విద్యార్థులకు ఇప్పటికీ ఉద్యోగాలు రాలేదు. రాబోయే రోజులలో పరిస్థితి మరింత దారుణంగా ఉండవచ్చునని అంచనా.

సాధారణంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులకు పలు రకాల ఉద్యోగాలు లభిస్తుంటాయి. వారికి అనేక ఆఫర్ లెటర్లు కూడా వస్తుంటాయి. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొందరు విద్యార్థులకైతే ఒక్క ఆఫర్ కూడా రాలేదు. '8-10 మంది విద్యార్థులను తీసుకునే కంపెనీలు ఇప్పుడు ఒకరిద్దరిని మాత్రమే తీసుకుంటున్నాయి. కొన్ని కంపెనీలు క్యాంపస్‌కు వస్తున్నప్పటికీ ఎవరినీ ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు' అని ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన ఓ విద్యార్థి వాపోయాడు.



టెక్నాలజీ, కన్సల్టింగ్, ఇతర సేవల రంగాలు సహా పలు రంగాలలో ఆర్థికాభివృద్ధి మందగించడమే ఈ పరిస్థితికి కారణం. ఆర్థిక మార్పిడులు, భౌగోళిక రాజకీయ ఆర్థిక ఆందోళనలు, మాంద్యం భయాలు అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకాలుగా మారాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో ఈ పరిస్థితి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. రాబోయే రెండు మూడు త్రైమాసికాలలో కూడా ఇది కొనసాగవచ్చునని ఫౌండిట్ జాబ్ పోర్టల్ (గతంలో మాన్‌స్టర్) సీఈఓ శేఖర్ గారిస తెలిపారు.

ఆటోమొబైల్, రిటైల్, బ్యాంకింగ్ వంటి టెక్నాలజీ యేతర రంగాలు నియామకాలను గణనీయంగా తగ్గించాయి. పాత ఐఐటీలు ఢిల్లీ, బాంబే, కాన్పూర్, మద్రాస్, ఖరగ్‌పూర్, రూర్కీ, గౌహతి, వారణాసిలో కూడా ఆందోళనకర పరిస్థితులు కన్పిస్తున్నాయి. దేశంలో మొత్తం 23 ఐఐటీలు ఉండగా ఇతర సంస్థల కంటే పాత ఐఐటీలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. ఈ సంస్థలలో ప్రవేశం పొందాలంటే ఎంతో పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సంస్థలలో చదివిన విద్యార్థులను ఉద్యోగాలలోకి తీసుకునేందుకు కంపెనీలు పోటీ పడుతుంటాయి. అయితే ఇప్పుడు ఆ వాతావరణం కన్పించడం లేదు. 'ఇది ఓ చక్రం లాంటిది. గతంలో తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు విద్యార్థులను ఉద్యోగాలలో చేర్చుకునేందుకు కంపెనీలు ఒక దానితో మరొకటి పోటీ పడ్డాయి. ఇప్పుడు వేగం మందగించింది. గతంలో తీసుకున్నంత మంది విద్యార్థులు ఇప్పుడు అవసరమా అని ఇతరులు కూడా ప్రశ్నించుకుంటున్నారు' మరో విద్యార్థి చెప్పాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇప్పటి వరకూ ఏడుసార్లు నియామక ప్రక్రియను నిర్వహించారు. 1,181 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1,300 మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చారు. ఐఐటీ వారణాసి (బీహెచ్‌యూ) గత సంవత్సరం నాలుగు రోజులలోనే వెయ్యి ఆఫర్ లెటర్లు పొందగా ఇప్పుడు 850 లెటర్లు మాత్రమే వచ్చాయి.

సమానత్వం, క్లైమేట్ జస్టిస్ ఆధారంగా వాతావరణ మార్పులపై చర్యలు : భారత్

దుబాయ్ : సమానత్వం, క్లైమేట్ జస్టిస్ ఆధారంగా వాతావరణ మార్పులపై చర్యలు ఉండాలని ధృఢంగా విశ్వసిస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి అభివృద్ధి చెందిన దేశాలే నాయకత్వం వహించాలని, అప్పుడే ఇది సాధ్యమవుతుందని భారత్ పేర్కొంది. దుబాయ్‌లో శనివారం కాప్ 28 సదస్సులో భారత పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. లక్ష్యంగా నిర్ణయించుకున్న సంవత్సరం (2030) కంటే 11 ఏళ్ల ముందుగానే ఉష్ణోగ్రత పెరుగుదలను నియంత్రించే ఉద్గార తీవ్రతను 33 శాతం వరకూ భారత్ తగ్గించిందని మంత్రి ప్రముఖంగా తెలిపారు. పునరుత్పాదక ఇంధన విషయంలో కూడా లక్ష్యం కంటే తొమ్మిదేళ్ల ముందుగానే అంచనాలను భారత్ అందుకుందని తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రహం అనే ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి పనిచేయడానికి మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని మంత్రి సదస్సుకు తెలిపారు. ఐరాసకు చెందిన ఎఫ్‌సిసిసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కాప్ 28 సదస్సు ఈ నెల 12తో ముగియనుంది.

ఢిల్లీలో తాత్కాలిక ఉద్యోగులపై కాలుష్య కాటు

న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీలో అరకొర ఆదాయంతో జీవితాలు నెట్టుకొస్తున్న తాత్కాలిక ఉద్యోగులు మితిమీరుతున్న వాయు కాలుష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజధానిలో వాయు నాణ్యత క్షీణిస్తోంది. వాయు నాణ్యత సూచిక పడిపోతుండడంతో శ్వాసకోశ వ్యాధిగ్రస్థుల ఇబ్బందులు చెప్పనలవి కావడం లేదు. ప్రజల ఆరోగ్యంపై వాయు కాలుష్యం తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతోంది. కార్మికుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతోంది. ఆరోగ్య సంరక్షణపై ఖర్చు పెరుగుతోంది. ముఖ్యంగా డిజిటల్ వేదికలు, యాప్‌లపై ఆధారపడుతూ తాత్కాలిక ఉద్యోగులు చేస్తున్న వారు ఎక్కువగా బహిరంగ ప్రదేశాలలో గంటల తరబడి ప్రయాణించాల్సి వస్తుంది. వీరు పూర్తి స్థాయి ఉద్యోగులు కారు. తాత్కాలిక లేదా అప్పగించిన విధుల ఆధారంగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటారు. ఊబర్, రాపిడో వంటి సంస్థల ద్వారా సేవలు అందించే వారు, ఆహార పదార్థాలు సరఫరా చేసే వారు, ఫ్రీలాన్స్ రచయితలు, గ్రాఫిక్ డిజైనర్లు ఈ కోవలోకి వస్తారు.

ఇలాంటి పనులు చేసే వారికి ఉద్యోగ భద్రత అంటూ ఏమీ ఉండదు. ఎలాంటి ఉద్యోగ ప్రయోజనాలూ ఉండవు. న్యాయ పరమైన రక్షణ కూడా లభించదు. పైగా వీరు ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ చేసే పని, దానికి ఉన్న డిమాండ్‌ను బట్టి వేతనం లభిస్తూ ఉంటుంది. ఫ్రీలాన్స్ రచయితలు, మార్కెటింగ్, వెబ్ డిజైనింగ్ చేసే ఉద్యోగుల పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. మిగిలిన వారి పరిస్థితి దుర్భరమే. మొత్తంమీద తాత్కాలిక ఉద్యోగుల ఆదాయం స్థిరంగా ఉండదు. ఢిల్లీలో కమ్ముకొస్తున్న వాయు కాలుష్యం వారిని ఊపిరి సలపనీయడం లేదు. అయినప్పటికీ పని చేసుకుంటే కానీ కడుపు నిండదు. ఇలాంటి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంగా మారిన కొలంబో

అంధకారంలో శ్రీలంక

కొలంబో : సిస్టమ్ వైఫల్యం కారణంగా శ్రీలంకలో శుక్రవారం దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీనితో అన్ని రకాల సేవలు స్తంభించిపోయాయని అధికారులు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణకు సిలోన్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ (సిఇబి) కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి నోయెల్ ప్రియాంత తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్థంభించిపోయాయి.

రాజస్థాన్‌లో స్వల్ప తేడాతోనే ఓటమి

- గతం కంటే 0.44 శాతం పెరిగిన ఓటింగ్
- ఫలితాలపై కాంగ్రెస్ అధిష్టానం సమీక్ష

న్యూఢిల్లీ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో చాలా స్థానాల్లో స్వల్ప తేడాతోనే తమ పార్టీ అభ్యర్థులు విజయానికి దూరమయ్యారని ఆ పార్టీ అధినాయకత్వం నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. ఇటీవ జరిగిన ఈ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఇక్కడి ఎఐసిసి ప్రధానకార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్షాసమావేశంలో రాజస్థాన్ తాత్కాలిక ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఇతర నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్, ఎఐసిసి రాజస్థాన్ ఇంఛార్జి సుఖ్‌జీందర్ సింగ్ తంథవా తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సుఖ్‌జీందర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఓటమికి కారణాలపై లోతుగా చర్చించినట్లు తెలిపారు. కొన్ని లోటుపాట్లు జరిగాయని, వాటిని పరిష్కరించి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా పోరాడాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే రాజస్థాన్‌లో పనితీరు మెరుగ్గా ఉందన్నారు. బిజెపి, కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల మధ్య వ్యత్యాసం చాలా తక్కువ ఉందని, వాస్తవానికి గతంలో కంటే తమ ఓటింగ్ ఈ ఎన్నికల్లో 0.44 శాతం పెరిగిందని సుఖ్‌జీందర్ తెలిపారు. అంతకు ముందు అశోక్ గెహ్లాట్ మీడియాతో అబద్ధాలు, మోసాలు, ప్రజల మధ్య చీలికలు తేవడం వంటి కుయుక్తులతోనే ఈ ఎన్నికల్లో బిజెపి స్వల్ప తేడాతో గెలుపొందిందని అన్నారు. మత పరమైన అంశాలు తెరపైకి తీసుకొచ్చి ప్రజలను తప్పుదారి పట్టించారని విమర్శించారు. రాజ్‌పుత్ నేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడి హత్యపై దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి బదిలీ చేయాలని కేంద్రానికి ప్రతిపాదిస్తూ లేఖపై తాత్కాలిక ముఖ్యమంత్రిగా ఉన్న తానే సంతకం చేయాల్సివచ్చిందని తెలిపారు. ఫలితాలు వెలువడి ఆరు రోజులు అవుతున్నా మూడు రాష్ట్రాల్లో బిజెపికి ముఖ్యమంత్రులు దొరకడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం

- ఐదేండ్లలో 36 వేలకు పైగా పోస్టులపై నిషేధం
- అధిక భాగం 'ఎక్స్'లోనివే

న్యూఢిల్లీ : 2018-2023 అక్టోబర్ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాలలో వచ్చిన వేలాది పోస్టులపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. ఈ కాలంలో 36,838 పోస్టులను తొలగించారు. వీటిలో ఎక్కువ భాగం 'ఎక్స్' (ఒకప్పటి ట్విట్టర్)లో పెట్టినవే. అందులో పెట్టిన 13,660 పోస్టులను కేంద్రం తొలగించింది. రాజ్యసభలో సీపీఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. కోవిడ్ వచ్చిన 2020లో అత్యధికంగా 9,849 పోస్టులను ప్రభుత్వం తొలగించింది.

గత ఐదు సంవత్సరాల కాలంలో పోస్టుల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం ట్విట్టర్, ఫేస్‌బుక్ సహా సామాజిక మాధ్యమాలకు ఎన్ని ఆదేశాలు జారీ చేసింది పోస్టులలో సమాచారం తొలగింపు, సవరణలకు సంబంధించి జారీ చేసిన ఆదేశాల వివరాలు ఏమిటి? అని బ్రిట్టాస్ ప్రశ్నించారు. సంవత్సరాలు, సంస్థల వారీగా వివరాలు అందజేయాలని కూడా ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ 'వినియోగదారులందరికీ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండాలని, అది సురక్షితంగా, నమ్మదగినదిగా ఉండాలని, అందరికీ జవాబుదారీగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోంది. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చట్టబద్ధంగా ఆదేశాలు జారీ చేసింది. ఐటీ చట్టం-2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం ప్రజలకు సమాచారం అందకుండా వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశాం. దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడేందుకు, దేశ భద్రతకు, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు అలాంటి చర్యలు అవసరమని ప్రభుత్వం భావిస్తే అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసే అధికారం ఈ చట్టం ప్రకారం కేంద్రానికి ఉంది' అని తెలిపింది.

గడచిన ఐదు సంవత్సరాలలో ఎక్స్‌లోని 13,660, ఫేస్‌బుక్‌లోని 10,197, యూట్యూబ్‌లోని 5,759, ఇతర సామాజిక మాధ్యమాలలోని 4,199, ఇన్‌స్టాగ్రామ్‌లోని 3,023 పోస్టులను కేంద్రం తొలగించింది. ప్రధానంగా ఎలన్ మస్క్ అధీనంలోకి వచ్చిన తర్వాత ఎక్స్ కార్పొరేషన్‌పై భారత్ సహా పలు ప్రపంచ దేశాలు అనేక ఫిర్యాదులు చేశాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు పెద్దపీట వేస్తానని, సామాజిక మాధ్యమంలో రాజకీయ జోక్యాన్ని అనుమతించబోనని మస్క్ గతంలోనే స్పష్టం చేశారు. 2022 సెప్టెంబర్ 27-ఈ ఏడాది ఏప్రిల్ 27 మధ్యకాలంలో పోస్టుల తొలగింపునకు సంబంధించి ఎక్స్‌కు కేంద్రం యాభై విజ్ఞాపనలు చేసింది. ట్విట్టర్ బాధ్యతలను మస్క్ చేపట్టకముందు పరిస్థితి భిన్నంగా ఉండేది.

'సైనిక వితంతువు'ల్లో పంజాబ్ టాప్

న్యూఢిల్లీ : దేశ రక్షణలో భాగంగా ఎంతో మంది సైనికులు ప్రాణాల్ని కోల్పోతారు. అయితే ప్రమాదవశాత్తూ సైనికులు తమ వృత్తిలోనే ప్రాణాలు కోల్పోవడం వల్ల.. వారి భార్యలు చిన్న వయసులోనే వితంతువులవుతారు. దేశవ్యాప్తంగా 'సైనిక వితంతువుల' సంఖ్య 6,98,252 మంది ఉన్నారని రక్షణమంత్రిత్వ శాఖ ఇటీవల లోక్‌సభకు తెలియజేసింది. దేశవ్యాప్తంగా ఆరు లక్షల మంది సైనిక వితంతువులు ఉంటే.. అందులో సగం మంది దాదాపు మూడు లక్షల మంది ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఉన్నారు. పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, చండీగఢ్ రాష్ట్రాల్లో 2,99,314 ఉన్నారని రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇక సైనిక వితంతువులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో పంజాబ్ టాప్‌లో ఉంది. ఒక్క పంజాబ్ రాష్ట్రంలోనే మాజీ సైనికుల వితంతువుల సంఖ్య 74,253 నమోదైనట్లు రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. అంటే దాదాపు ఈ ఒక్క రాష్ట్రంలోనే 10.63 శాతం మంది వితంతువులు ఉన్నట్లు లెక్క. ఇక పంజాబ్ తర్వాత కేరళ రెండో స్థానంలో నిలిచింది. కేరళలో 69,507 మంది సైనిక వితంతువులు ఉన్నారు. ఉత్తర ప్రదేశ్, 68,815 మంది, హర్యానా 53,546 మందితో ఆరోస్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్ 48,924, రాజస్థాన్ 44,665, హిమాచల్ ప్రదేశ్ 39,367, జమ్మూ అండ్ కాశ్మీర్ 21,890, ఢిల్లీ 14,029, చండీగఢ్ 2,640మంది సైనిక వితంతువులున్నారని రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది.

కాగా, మాజీ సైనికుల వితంతువుల సంక్షేమం గురించి ఎన్‌సిపి ఎంపీ సునీల్ దత్తాత్రే తత్కరే అడిగిన ప్రశ్నకు .. రక్షణ శాఖా సహాయ మంత్రి అజయ్ భట్ జవాబిచ్చారు. 'సైనిక వితంతువులు కుటుంబ పెన్షన్‌కు అర్హులు. వీరికందించే పెన్షన్ ప్రతి ఐదేళ్లకూ వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్ఓపి) కింద సవరించబడుతుంది. అలాగే కుటుంబ పెన్షన్ కూడా ప్రతి ఆరు నెలల తర్వాత సవరించబడే డియర్‌నెస్ రిలీఫ్‌తో ముడిపడి ఉంటుంది. 2022లో మరణించిన రక్షణ సిబ్బందిలో 32 మంది వితంతువులకు కారుణ్య నియామకాలు మంజూరు చేయబడ్డాయని అజయ్‌భట్ లోక్‌సభకు తెలిపారు.

నేను ఏ పేపర్‌పైనా సంతకం చేయలేదు : మీనాక్షి లేఖి

న్యూఢిల్లీ : హమాస్ ఉగ్రవాద సంస్థగా ప్రకటించే ప్రశ్నతో కూడిన ఏ పేపర్‌పైనా తాను సంతకం చేయలేదని కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి శనివారం వివరణ ఇచ్చారు. భారత్ హమాస్‌ని ఉగ్రవాద సంస్థగా ప్రకటించే యోచనలో ఉందా? అనే స్టార్ గుర్తు లేని ప్రశ్నతో కూడిన పేపర్‌పై లేఖి సమాధానం ఇచ్చినట్టుగా సోషల్‌మీడియలో వార్తలొచ్చాయి. ఈ వార్తలపై ప్రస్తుతం విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా ఉన్న లేఖి స్పందించింది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆమె పోస్టు చేశారు. 'ఈ అంశంపై విదేశాంగ మంత్రి స్పష్టత ఇస్తారు. ఇందులో సాంకేతిక లోపం ఉన్నట్లు తెలుస్తోంది. మీకు తప్పుడు సమాచారం అందింది. ఈ ప్రశ్నతో ఉన్న ఏ పేపర్‌పై నేను సంతకం చేయలేదు.' అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టుకి విదేశాంగ శాఖ ఎస్. జైశంకర్, ప్రధాన మంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. ఇక లేఖి స్పష్టతపై శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది స్పందించారు. 'ఆమె సంతకం ఫోర్జరి జరిగి ఉంటుందని ఆమె అనుకుంటున్నారా? ఇలా జరిగితే తీవ్ర స్థాయి నిబంధనల ఉల్లంఘనే. దీనిపై ఆమె నుంచి స్పష్టత వస్తే మేం సంతోషిస్తాం' అని అన్నారు.

కాగా, హమాస్‌ని ఉగ్రవాద సంస్థగా ప్రకటించే ప్రతిపాదనలో ఉందా? అనే దానిపై కాంగ్రెస్ ఎంపి కుంబకుడి సుధాకరన్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో హమాస్‌ని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఇజ్రాయెల్ రాయబారి భారత్‌ను అభ్యర్థించారు. అయితే ఇజ్రాయెల్ రాయబారి అభ్యర్థనపై భారత్ ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. హమాస్, ఇజ్రాయెల్ పోరు వల్ల పరిస్థితులు మరింత దిగజారుతుండడంపై ప్రధాని నరేంద్రమోడీ, విదేశాంగ మంత్రి జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను కేవలం శాంతి యుత మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిస్తోంది.

మీకోసం

అడుగు మాడిన గిన్నెలను ఉప్పు, నిమ్మచెక్కతో కలిపి తోమితే మురికి సులభంగా పోతుంది.

జీవన సౌరభం

గెలవాలనే స్ఫూర్తితో పోరాడితే ఓడినా తట్టుకోగలరు.

వానవిల్లు

సూరీడు మామ వచ్చాడు
ఎండను తన కూడా తెచ్చాడు
ఇంటి బెజ్జం నుండి తుంటరి
సూర్య కిరణం తొంగి చూసింది

ఎవరి పనుల్లో వారున్నారు
గోడ మీద గడియారం
టిక్ టిక్ మంటూ
సంగీతం వినిపిస్తుంది

ఆకాశం అత్త మబ్బుల
బుడగలను ఎగరేసింది
గాలి బావ సై అన్నాడు
చిటపట చినుకుల పిల్ల కెవ్వుమంది

ఎండను వాన కలిసింది
వానవిల్లుగా విరిసింది
పిల్లలకు ఆనందం ఇచ్చింది!



- గాదిరాజు రంగరాజు,
న్యూ జెర్సీ.



లెక్కచేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆకారాలను అంకెలుగా గణించి లెక్క చేయండి. క్లూ ఆధారంగా చివరి లైను జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ

గోటూరి తేజశ్రీ గాయత్రి,
5వ తరగతి,
మం.ప్ర.ప.ప్రాథమిక పాఠశాల,
జె.తిమ్మాపురం,
పెద్దాపురం మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆస్తమాను అశ్రద్ధ చేయొద్దు

ఆస్తమా లేదా ఉబ్బసం చాలా మందిని బాధించే ఆరోగ్య సమస్య. ఇది ప్రాణాంతకం కాకపోయినా, తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంది. వ్యాధి ప్రారంభంలోనే గుర్తిస్తే తీవ్రతను చాలావరకూ తగ్గించటానికి మందులు ఉన్నాయి. దీర్ఘకాలంగా ఇబ్బందులకు గురిచేసే ఈ వ్యాధిని అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య చికిత్సతో అదుపులో పెట్టుకుని వీలైనంత సాధారణ జీవనాన్ని గడపే అవకాశాలు కూడా ఉన్నాయి.

ఏటేటా శీతాకాలం ముదిరేకొద్దీ వాతావరణంలో చల్లటి వాతావరణం, ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి తగ్గిపోతుండటం తెలిసిందే. ఈ కాలంలో సామాన్యంగా ప్రతి ఒక్కరిలో రోగ నిరోధక శక్తి మరింత పడిపోయి ఆస్తమా తీవ్రరూపం దాల్చుతుంది. ఇలాంటి సమయంలోనే ప్రతి ఒక్కరిలోనూ తమలో ఉన్న అనారోగ్య సమస్యలు ఒక్కొక్కటిగా కూడా బయటకు వస్తుంటాయి. గాలి, నీటిలో క్రిమికీటకాల వ్యాప్తి ద్వారా కూడా వ్యాధులు వ్యాపిస్తుండటం సర్వ సాధారణంగా జరిగేదే. అయితే దగ్గు, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు చలికాలంలో అతిత్వరగా వ్యాప్తి చెందుతాయి. సైనస్ వంటి సమస్యలు ఉన్న వారు ఈ కాలంలో అత్యంత జాగ్రత్తగా మెలగటం ఉత్తమం. కీళ్ల నొప్పులు, చర్మవ్యాధుల సమస్యలు కూడా మామూలుగా ఉన్నవి తీవ్రంగా మారుతుంటాయి. పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వ్యాధి ముదరకముందే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లోని నిపుణులైన వైద్యుల సలహాలు తీసుకుంటే తద్వారా వాటిని సకాలంలో నియంత్రించటానికి అవకాశం ఉంటుంది. తీవ్రత పెరిగితే నియంత్రణకు కొంత సమయం పడుతుంది. జ్వరాలు, కీళ్లనొప్పులు, చర్మ సంబంధిత వ్యాధులు మొదలైన సమస్యలు ఉన్నప్పటికీ ఈ కాలంలో మరింతగా బాధించే సమస్యల్లో ఆస్తమా (ఉబ్బసం) ఒకటి.

ఏ విధంగా వ్యాప్తి చెందుతుందంటే ...

ఆస్తమా వ్యాధి చిన్న పిల్లల నుంచి పెద్ద వారిలో వచ్చే శ్వాస సంబంధితమైన వ్యాధి. ఇది వస్తే ఊపిరితిత్తుల్లో వాపు వల్ల వాయు మార్గాలు కుంచించుకుపోతాయి. దీనివల్ల శ్వాసకు అడ్డంకులు ఏర్పడి రోగి సరిగ్గా గాలి తీసుకోలేక ఇబ్బందులు పడుతుంటారు. ఆస్తమా ఉన్న వారిలో ఆయాసం, దగ్గు బాగా ఇబ్బంది పెడతాయి. వర్షాకాలం, శీతాకాలాల్లో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల విటమిన్–డి తగ్గిపోతుంది. తద్వారా రోగ నిరోధక శక్తి పడిపోయి ఆస్తమా తీవ్ర రూపం దాల్చుతుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి 30 నుంచి 35 సంవత్సరాల పెద్దవారిలో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లల్లో వస్తే దానిని చైల్డ్ హుడ్ ఆన్సెట్ ఆస్తమా అని, పెద్దల్లో అయితే అడల్ట్ ఆన్సెట్ ఆస్తమాగా పిలుస్తారు. న్యూమోనియా, జలుబు వంటివి కూడా ఎక్కువగా పీడిస్తుంటాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు తగ్గకుండా ముదిరితే ఆస్తమాకు దారితీస్తుంటుంది.

ఎందుకు వ్యాప్తి చెందుతుందంటే..

ఆస్తమా రావటానికి అనేక కారణాలు ఉన్నాయి. కొన్ని తెలుసుకోవచ్చు. మరికొన్నింటిని గుర్తించటం కష్టం కూడా. వంశపారంపర్యంగా కూడా ఇది సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి ఉన్నా పిల్లలకు రావొచ్చు. గాలి, నీరు, వాయు కాలుష్యాల ద్వారా కూడా వచ్చే ప్రమాదం ఉంది. దీర్ఘకాలిక జలుబు, సైనస్ ఇన్ఫెక్షన్స్, దుమ్ము, ధూళి, బూజు, పెంపుడు జంతువులు, ఆహార పదార్థాల్లోని రసాయనాల వల్ల కూడా వస్తుంది. ఇంట్లో ఉండే కుక్కలు, పిల్లులు, ఇతర జంతువుల వల్ల కూడా వ్యాపించే అవకాశం ఉంటుంది. చర్మ వ్యాధులు ఉంటే చిన్నారులకు కూడా వచ్చే అవకాశం ఉంది. జలుబు వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా రావొచ్చు. సిగరెట్ పొగ, సెంటు వాసనల ద్వారా కూడా సోకొచ్చు. నొప్పి తగ్గించే మందులు (పెయిన్ కిల్లర్లు), బిపి నియంత్రణకు వాడే మందుల ద్వారా వచ్చే అవకాశం ఉంది. అజీర్తి, గ్యాస్ట్రబుల్, మానసిక ఒత్తిళ్లు వంటివి కూడా కారణం కావొచ్చు.

చికిత్సా పద్ధతులు ఇవే...

ఆస్తమాను తగ్గించటానికి నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో ఇన్‌హెలేషన్ థెరపీ, మాత్రల ద్వారా చేసే చికిత్స, ఇంజక్షన్లతో వైద్యం.

ఇన్‌హెలేషన్ థెరపీ : ఇన్‌హెలేషన్ థెరపీ నేడు ప్రపంచ వ్యాప్తంగా అమలు చేస్తున్న అత్యున్నత చికిత్సా విధానం. దీనిలో రిలీవర్స్, ప్రివెంటర్స్ ఉన్నాయి. వీటివల్ల నేరుగా మందు వాయు మార్గం నుంచి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి తక్షణం పనిచేస్తుంది. రిలీవర్స్ తాత్కాలికంగా ఉపశమనం కలిగించేవి. ప్రివెంటర్స్ దీర్ఘకాలం వ్యాధిని అదుపులో ఉంచుతాయి. ఇతర ఔషధాలతో పోల్చితే ఈ ఇన్‌హేలర్స్ ద్వారా ఇచ్చేవి తక్కువ మోతాదుతో ఉంటాయి. నిరభ్యంతరంగా ఈ విధానాన్ని ఎంచుకోవచ్చు. ఈ విషయం ఇప్పటికే అనేక పరిశోధనల్లో వెలుగులోకి వచ్చింది.

ఔషధాలతో చికిత్స : ఔషధాలను తీసుకుంటే అవి మొదట రక్తంలోకి వెళ్లి చిట్ట చివరకు ఊపిరితిత్తులను చేరుకుని పనిచేస్తాయి. అందుకు కొంత ఎక్కువ సమయం పడుతుంది. .

ఇంజక్షన్‌తో వైద్యం : సిరప్‌లు, ఇంజక్షన్ల ద్వారా తీసుకునే మందు మొదట రక్తంలో కలిసి చివరగా లంగ్స్‌పై ప్రభావాన్ని చూపుతాయి. ఈ మందులు రక్తంలో కలవడం వల్ల శరీరంలోకి ఇతర భాగాలకు చేరిపోయి దుష్ప్రచారం చూపే అవకాశం ఉంది.

వ్యాధి లక్షణాలు ఇవే...

- ఉదయం, రాత్రి వేళల్లో దగ్గు తీవ్రత పెరగటం ఛాతీ బిగుసుకుపోయినట్లుగా ఉండటం
- శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు
- తరచూ ఆయాసం రావటం
- గురక తీవ్రత ఎక్కువగా ఉండటం
- ఊబకాయ ఇబ్బందులు
- గొంతు నుంచి ఈల వంటి శబ్దం రావటం అలవాట్లు మార్చుకోవాలి
- విటమిన్లు ఉండే పోషకాహారాన్ని తీసుకోవాలి తాజా ఆకుకూరలు, కాయగూరలు, చిరుధాన్యాలు వంటివి మేలు చేస్తాయి
- విటమిన్ సి ఉండే కమలాలు, నిమ్మ, బత్తాయి తినాలి
- ధూమపానం, మద్య పానానికి దూరంగా ఉండాలి
- ఆయిల్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి మానుకోవాలి
- ఇంట్లో వండిన తాజాగా వేడి వేడిగా ఉండే పదార్థాలను భుజించాలి
- పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి
- కాలుష్య ప్రాంతాలకు వెళ్లకుండా ఉంటే మంచిది
- వీలైనంతవరకూ మాస్కులు ధరించటం మేలు
- చలిగాలుల్లో బయట తిరగటం మంచిది కాదు

- డాక్టర్ మోదిని వెంకట్రావు,
ప్రొఫెసర్,
సిద్ధార్థ మెడికల్ కళాశాల,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పల్మనాలజీ
ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి,
విజయవాడ.

తండేల్ ముహూర్తపు వేడుక

నాగ చైతన్య అక్కినేని, దర్శకుడు చందూ మొండేటి గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించనున్న చిత్రం 'తండేల్'. హైదరాబాద్‌లో శనివారం నాడు ముహూర్తపు వేడుకలో హీరో నాగార్జున, వెంకటేష్, అల్లు అరవింద్, పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ముహూర్తపు షాష్‌కు నాగార్జున కెమెరా స్విచాన్ చేయగా, వెంకటేష్ క్లాప్ ఇచ్చారు. అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందజేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ, నాగచైతన్యకు సరైన జోడిగా సాయిపల్లవి వచ్చారు. పాన్ ఇండియా సౌండ్ అలవాటు చేసిన దేవిశ్రీ ప్రసాద్ రావడం, అద్భుతమైన కెమరామ్యాన్ షామ్‌దత్, ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఇలా అద్భుతమైన టీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మించడం చాలా ఆనందంగా వుంది' అని అన్నారు. ఈనెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని నాగచైతన్య చెప్పారు.

గీతాంజలి పాత్ర ఎంతో నచ్చింది : రష్మిక

సందీప్ వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా, హీరోయిన్‌గా రష్మిక నటించిన చిత్రం యానిమల్. తాజాగా ఈ చిత్ర విజయంపై రష్మిక మాట్లాడారు. 'యానిమల్ విడుదలైన రోజు నుంచి ఎన్నో ప్రశంసలు వస్తున్నాయి. వర్ణించలేనంత ఆనందంగా ఉంది. నాకు గీతాంజలి పాత్ర ఎంతో నచ్చింది. ఆమె ధైర్యం నిజంగా ప్రశంసనీయం. ఆ పాత్రలో నటించిన ప్రతి సన్నివేశాన్నీ నేను ఎంజాయ్ చేశా.' అని తెలిపారు. ఇక రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. 'యానిమల్'లో ఆమె నటనను ప్రశంసిస్తూ రాహుల్ కూడా పోస్ట్ పెట్టారు.

యథార్థ ఘటన ప్రేరణతోనే 'పిండం'

సాయికిరణ్ దైదా

'నల్గొండ జిల్లాలో ఒక ఘటన జరిగింది. అది మా నాయనమ్మ చెప్పడం వల్ల నాకు బాగా గుర్తుండిపోయింది. ఆ యథార్థ ఘటన చుట్టూ కల్పిత కథ అల్లాం. ప్రేక్షకులు హారర్ జానర్ సినిమాలు చూడటానికి వచ్చేది భయపడటం కోసమే. ఆ హారర్ అనుభూతిని కలిగించి, భయం ఇవ్వాలి. పిండం నా మొదటి సినిమా. భారీ తారాగణం ఉండదు. కథ బలంగా ఉండాలి. దానిని దృష్టిలో పెట్టుకొని స్క్రిప్ట్‌ని ఎంతో శ్రద్ధతో రాశాను. విజయం పట్ల మరింత నమ్మకం కలిగింది. అప్పుడే 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనే ట్యాగ్ లైన్ పెట్టి ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాం' అని దర్శకుడు సాయికిరణ్ దైదా చెప్పారు. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన ఈ చిత్రాన్ని కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఈ నెల 15న ఈ సినిమా విడుదల కానుంది. 'ఇప్పటిదాకా తెలుగులో వచ్చిన హారర్ సినిమాలన్నీ ఒక ఎత్తు. మా పిండం సినిమా వాటికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆసక్తికరంగా ఉంటుంది' అని దర్శకుడు వివరించారు.

చిరంజీవితో సినిమా చేస్తా: సందీప్

అవకాశం వస్తే హీరో చిరంజీవితో సినిమా చేస్తానని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చెప్పారు. యానిమల్ సక్సెస్‌లో భాగంగా ఆయన అమెరికాలో పర్యటిస్తున్నారు. అక్కడి సినీ ప్రియులతో సరదాగా ముచ్చటిస్తూ, తనకు చిరంజీవితో కలిసి వర్క్ చేయాలని ఉందని చెప్పారు. అవకాశం వస్తే తప్పకుండా ఆయనతో ఓ యాక్షన్ డ్రామా తెరకెక్కిస్తానని అన్నారు.

'అస్త్ర' అవార్డుల బరిలో జవాన్

షారుక్– అట్లీల కాంబోలో వచ్చిన 'జవాన్' హాలీవుడ్ అవార్డుల బరిలో నిలిచింది. ఏటా హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డుల పండగ ఫిబ్రవరిలో జరుగుతుంది. తాజాగా దీని పేరును 'అస్త్ర' అవార్డులుగా మార్చారు. 2024కు గానూ 'అస్త్ర' అవార్డుల కోసం నామినేట్ అయిన చిత్రాల జాబితాను సంస్థ ప్రకటించింది. ఇందులో షారుక్ నటించిన 'జవాన్' ఒక్కటే మనదేశం నుంచి నామినేట్ అయింది. అంతర్జాతీయ సినిమా విభాగంలో 'జవాన్' 10 విదేశీ చిత్రాలతో పోటీ పడనుంది. గతేడాది ఈ అవార్డుల్లో 'ఆర్ఆర్ఆర్' ఐదు విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. తాజాగా 'జవాన్' ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎమ్‌డీబీ) విడుదల చేసిన మోస్ట్ పాపులర్ చిత్రాల జాబితాలోనూ మొదటి స్థానంలో నిలిచింది.

ఇక ధనాధన్

- భారత్, దక్షిణాఫ్రికా తొలి టీ20 నేడు
- ఇరు జట్ల నుంచి బరిలో యువ ఆటగాళ్లు
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దర్బన్ : టీమ్ ఇండియా తుది జట్టు కూర్పుపై కుస్తీ పడుతోంది. శుభ్‌మన్ గిల్ రాకతో ఓపెనింగ్ జోడీ ఎవరనేది ఉత్కంఠగా మారింది. ఆసీస్‌తో సిరీస్‌లో యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ రాణించారు. రుతురాజ్ ఓ మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. యశస్వి పవర్‌ప్లేలో పవర్‌ఫుల్ ప్రభావం చూపించాడు. గిల్ ఓపెనర్‌గా వస్తే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. శ్రేయస్ అయ్యర్ వైట్‌బాల్ ఫార్మాట్‌లో దూకుడు చూపిస్తున్నాడు. వేగంగా పరుగులు సాధిస్తున్నాడు. అయినా, యువ క్రికెటర్ తిలక్ వర్మకు ఈ ఫార్మాట్‌లో అవకాశం ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తోంది. బ్యాటింగ్ లైనప్‌లో కుడి–ఎడమ కాంబినేషన్‌కు సైతం తిలక్ వర్మ ఉపయుక్తం. సూర్య కుమార్, రింకూ సింగ్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. యువ వికెట్ కీపర్ జితేశ్ శర్మ కంగారూలపై ఖతర్నాక్ ప్రదర్శన చేశాడు. క్రీజులోకి వచ్చీ రాగానే దంచికొడ్తున్నాడు. జితేశ్‌కు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సముఖంగా కనిపిస్తోంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరల్డ్ నం.1 రవి బిష్ణోయ్‌తో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పోటీపడుతున్నాడు. ఆసీస్‌తో సిరీస్‌లో బిష్ణోయ్ అత్యధిక వికెట్లు కూల్చాడు. సఫారీలపైనా ప్రభావం చూపేందుకు సిద్ధమవుతున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ సైతం భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఈ ఇద్దరిలో ఎవరు తుది జట్టులో నిలుస్తారో చూడాలి. మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్‌లలో ఒకరు బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. రవీంద్ర జడేజా, దీపక్ చాహర్‌లు ఆల్‌రౌండర్లుగా జట్టులో నిలువనున్నారు!.

భలే మంచి ఛాన్స్! :

టీ20 ప్రపంచకప్ ముంగిట వెస్టిండీస్‌తో సఫారీలు మరో మూడు టీ20లు ఆడాల్సి ఉంది. కానీ ఆ సిరీస్‌లో ప్రపంచ కప్ జట్టే తలపడనుంది. దీంతో వరల్డ్‌కప్ రేసులో నిలిచేందుకు, సత్తా చాటేందుకు సఫారీ క్రికెటర్లకు ఇదే చివరి అవకాశం. దీంతో భారత్‌తో సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. రీజా హెండ్రిక్స్, స్టబ్స్, ఫెరీరా, మార్కో జాన్సెన్ సహా జెరాల్డ్, బర్గర్‌లు వరల్డ్‌కప్ బెర్త్‌పై కన్నేశారు. స్వదేశంలో అనుకూల పరిస్థితుల్లో మెరిస్తే.. ప్రపంచకప్ జట్టు రేసులో నిలిచేందుకు అవకాశం ఎక్కువ. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్, డెవిడ్ మిల్లర్ సైతం తమదైన జోరు చూపించాలని ఎదురు చూస్తున్నారు. గత సీజన్ ఎస్‌ఏ20లో మార్క్‌రామ్ పరుగుల మోత మోగించాడు. కొన్నాండ్లుగా ఈ ఫార్మాట్‌లో మిల్లర్ అద్భుతాలు చేస్తున్నాడు. ఈ జోడీ బ్యాట్‌తో అంచనాలు అందుకుంటే.. సఫారీలకు బ్యాటింగ్ లైనప్‌లో కష్టాలు ఉండవు. షంషి, కేశవ్ మహరాజ్‌లు భారత్‌పై మాయ చేసేందుకు చూస్తుండగా.. జాన్సెన్, జెరాల్డ్‌లు పేస్ సత్తా చాటనున్నారు.

పిచ్, వాతావరణం : డర్బన్‌లో నేడు ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మ్యాచ్ సమయంలో వర్షం సూచనలు లేకపోయినా వాతావరణం మేఘావృతమై ఉండనుంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో పేసర్లు వికెట్ల వేటలో ప్రభావం చూపనున్నారు. ఇక్కడ గతంలో ఆసీస్‌తో మ్యాచుల్లో తొలి ఇన్నింగ్స్‌ల్లో 190 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి. నేడు భారత్, సఫారీ టీ20లోనూ భారీ స్కోర్లకు అవకాశం ఉంది. ఇక్కడ టాస్ ప్రభావం పెద్దగా ఉండదు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్/రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రింకూ సింగ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దీపక్ చాహర్, కుల్దీప్ యాదవ్/రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్/ముకేశ్ కుమార్.

దక్షిణాఫ్రికా : హెండ్రిక్స్, మాథ్యూ, మార్క్‌రామ్ (కెప్టెన్), క్లాసెన్ (వికెట్ కీపర్), డెవిడ్ మిల్లర్, ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, జెరాల్డ్ , బర్గర్ , షంషి.

రూ.450 కోట్లు ఆర్జన!

దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు క్రిస్‌మస్‌ను ముందే జరుపుకోనుంది. మూడు ఫార్మాట్ల పర్యటనకు భారత జట్టు రావటంతో.. ఆ దేశ క్రికెట్ బోర్డు రానున్న 20 రోజుల్లో ఏకంగా రూ.450 కోట్లు ఆర్జించనుంది. మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు భారత జట్టు ఇక్కడ ఆడనుంది. తొలి టీ20 మ్యాచ్‌కు ఇప్పటికే టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. సిరీస్‌లో మిగతా మ్యాచులకు సైతం టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడు కానున్నాయి. దీంతో పండుగ సీజన్‌లో సఫారీ క్రికెట్ బోర్డు కాసుల పంట పండనుంది.

21న రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికలు ఎట్టకేలకు జరుగనున్నాయి. గతంలో పంజాబ్, హర్యానా హైకోర్టు విధించిన స్టే ఆర్డర్‌ను సుప్రీంకోర్టు తొలగించటంతో.. ఎన్నికలకు మార్గం సుగమం అయ్యింది. డిసెంబర్ 21న ఎన్నికలు, కౌంటింగ్, ఫలితాల వెల్లడికి తాజాగా రిటర్నింగ్ ఆఫీసర్ నోటీఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టు 12న ఎన్నికలకు రంగం సిద్ధం కాగా.. ఒక్క రోజు ముందు నిలుపుదల ఆదేశాలతో ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. పర్యావసానంగా డబ్ల్యూఎఫ్ఐపై అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య సస్పెన్షన్ వేటు సైతం వేసింది. డిసెంబర్ 21న ఎన్నికలు, ఫలితాలు.. పంజాబ్, హర్యానా హైకోర్టు ముందున్న రిట్ పిటిషను తీర్పుకు లోబడి ఉంటాయని రిటర్నింగ్ ఆఫీసర్ విశ్రాంత న్యాయమూర్తి ఎం.ఎం కుమార్ తెలిపారు. ఆగస్టు 7 నాటికి ఓటర్ల జాబితా ఖరారు కావటంతో.. ఇప్పుడు ఆ తర్వాత ప్రక్రియ మాత్రమే ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా సైతం ఆగస్టు 7 నాటిదే అంతిమమని పేర్కొన్నారు. దీంతో ఇక నేరుగా ఓటింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. న్యూఢిల్లీలోని ఒలింపిక్ భవన్‌లో పోలింగ్ జరుగుతుందని రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు. బిజెపి ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మహిళా అథ్లెట్లను లైంగికంగా వేధించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని భారత స్టార్ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద సుమారు రెండు నెలల పాటు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68